# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 48, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం -07 - మే - 2025


## ఉగ్రవాదంపై పోరాడండి..
## మీ వెనక మేం ఉంటాం: భారత్ కు అమెరికా హామీ



**వీలైనంత సాయం అందిస్తామని ప్రకటించిన అమెరికా స్పీకర్**

**భారత్ తమకు కీలక భాగస్వామి అని వెల్లడి**

**పహల్గామ్ దాడి తర్వాత అమెరికా నేతల సంఘీభావం**

న్యూఢిల్లీ : ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ దేశం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ స్పష్టం చేశారు.

## పంజాబ్ లో ఉగ్రకుట్రను భగ్నం చేసిన పోలీసులు



పహల్గామ్ దాడి తర్వాత మరిన్ని ఉగ్రదాడులు జరగొచ్చనే హెచ్చరికలు

పంజాబ్ లో ఉగ్రవాదుల ఆయుధాలు, వైర్ లెస్ కమ్యూనికేషన్ పరికరాల స్వాధీనం

దేశవ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం, బలగాలు అప్రమత్తం

న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రదాడి ఘటన అనంతరం దేశంలో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యం లో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది.

## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు జడ్జి సంచలన వ్యాఖ్యలు




న్యూఢిల్లీ : భారత దేశంలో కుల ఆధారిత రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లను రైలు బోగీతో పోల్చారు. రిజర్వేషన్ వ్యవస్థ రైలు కంపార్ట్ మెంట్‌లా మారి పోయిందని, ఒకసారి బోగీలోకి ప్రవేశించిన వారు ఇతరులు రావడానికి ఇష్ట పడటంలేదని అన్నారు.

# గుర్తు పెట్టుకో.. ముమ్మాటికి మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది

- రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు విమర్శలు
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని జోస్యం
- రేవంత్ రెడ్డికి చేతకాకుంటే అడ్డమైన హామీలు ఇచ్చినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్




హైదరాబాద్ : తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. "ముఖ్యమంత్రిగారికి చివరిసారి చెబుతున్నాం. కేసీఆర్‌ను ఇప్పటి వరకు ఎన్ని మాటలన్నా పడ్డాం.

# ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించింది

### శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారీ యూనిట్.. మే 8న మంత్రి లోకేశ్ భూమిపూజ

రూ.5001 కోట్లతో ఎల్జీ ప్లాంట్... 2000 ఉద్యోగాలు

ఆరేళ్లలో దశలవారీగా యూనిట్ నిర్మాణం, రూ.839 కోట్లతో 5 అనుబంధ పరిశ్రమలు

ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి



అమరావతి : రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన దిశగా మరో కీలక ముందడుగు పడనుంది. అంతర్జాతీయ గృహోపకరణాల తయారీ దిగ్గజం ఎల్జీ ఎలక్ట్రానిక్స్, తిరుపతి సమీపంలోని శ్రీసిటీలో భారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ నూతన ప్లాంట్‌కు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ మే 8న భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాబోయే ఆరేళ్లలో వివిధ దశల్లో మొత్తం రూ.5,001 కోట్ల పెట్టుబడి పెట్టాలని, తద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించాలని మిగతా..2లో

## దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా అమరావతి



- చంద్రబాబు, పవన్ కృషితో స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమన్న శ్రీదేవి
- అమరావతి 2.0 కింద 17 కీలక ప్రాజెక్టు సాకారమవుతున్నాయని వెల్లడి
- జగన్ పాలనలో అమరావతి విధ్వంసం, దోపిడీ జరిగిందని ఆరోపణ

అమరావతి : ఏపీ రాజధాని అమరావతి దేశంలోనే అత్యుత్తమంగా రూపుదిద్దుకోనుందని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి మిగతా..2లో

## దేవాదాయ శాఖలో ఉద్యోగాల భర్తీకి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్




**మరో 200 వైదిక సిబ్బంది కొలువుల నియామకాలకు సైతం అంగీకారం**

**23 ప్రధాన ఆలయాలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి అని సీఎం సూచించారు**

**ఆగమశాస్త్రం ప్రకారమే ఆలయాల అభివృద్ధి పనులు చేపట్టాలని సీఎం**

అమరావతి : : దేవాదాయ శాఖలో 137 ఉద్యోగాల భర్తీకి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సహా గ్రేడ్ 1, గ్రేడ్ 3 ఈవో పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని పేర్కొన్నారు.

## భద్రతపై ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష.. అజిత్ దోవల్‌తో భేటీ



ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మధ్య 48 గంటల్లో రెండుసార్లు భేటీ

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రస్తుత భద్రతా పరిస్థితులపై చర్చ

మే 7న దేశవ్యాప్తంగా 259 ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహణకు కేంద్ర హోంశాఖ ఆదేశం

న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రవాద దాడి అనంతరం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, దేశ భద్రతాంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో నేడు సమావేశమై తాజా పరిణామాలపై చర్చించారు.

# పదేళ్ళలో మీరు చేయలేనివి
# 16 నెలల్లో మేము చేసి చూపించాం

### ఇందిరమ్మ ప్రభుత్వంలో రహస్యాలు ఉండవు.. మా ప్రభుత్వం తెరిచిన పుస్తకం

- కాంగ్రెస్ పార్టీ స్వాతంత్రోద్యమం నుండి నేటి వరకు అభివృద్ధి చేసింది
- ఇందిరమ్మ ప్రభుత్వంలో భూభారతి చట్టం తీసుకొచ్చి రైతులకు అండగా ఉన్నాం
- పార్టీలో పదవులు అనుభవిస్తున్న వారు తప్పుకొని కొత్తవారికి అవకాశం ఇవ్వాలి
- కొన్ని ప్రాంతీయ పార్టీలు వచ్చి తారాజువ్వలుగా ఎగిసి వెంటనే నేల రాలుతాయన్నారు
- మంత్రి క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల నాయకులతో మండలాల వారీగా విడివిడిగా సమీక్షా సమావేశం



హైదరాబాద్ : : కూసుమంచిలో మంగళవారం స్థానిక ఎస్సార్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి సంస్థాగత ఎన్నికల నిర్వహణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ ఎమ్మెల్యే, ఖమ్మం జిల్లా ఇంచార్జ్ నాయిని రాజేందర్ రెడ్డి, మంత్రి పొంగులేటి.శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నుంచి దేశ స్థాయి వరకు విస్తరించి ఉందన్నారు. కులమతాలకతీతంగా.. మిగతా..2లో

## ఓబుళాపురం మైనింగ్ కేసు - గాలి జనార్దన్‌రెడ్డిని దోషిగా తేల్చిన సీబీఐ కోర్టు..



హైదరాబాద్ : ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు ఇచ్చింది. ఈ కేసులో గాలి జనార్ధన్‌రెడ్డి సహా ఐదుగురిని దోషులుగా తేల్చింది. ఏ1గా బీవీ శ్రీని వాసరెడ్డి, ఏ2 గాలి జనార్దన్‌రెడ్డి, ఏ3 వీడీ రాజ గోపాల్, మిగతా..2లో

## కార్పొరేట్ ప్రీస్కూల్స్‌కు దీటుగా అంగన్వాడీలు.. మీ పిల్లలను చేర్పించండి: మంత్రి సీతక్క



హైదరాబాద్ : కార్పొరేట్ ప్రీస్కూల్లకు దీటుగా అంగన్వాడీలు పనిచేస్తున్నాయని మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లిలో ఐసీడీఎస్ నర్సాపూర్ పరిధిలోని మిగతా..2లో

## తెలంగాణలో ప్రయాణికులకు ఊరట.. ఆర్టీసీ సమ్మె వాయిదా




ఆర్టీసీ సమ్మెను తాత్కాలిక వాయిదా వేసిన కార్మికులు

మంత్రి పొన్నంతో ఆర్టీసీ జేఏసీ నాయకుల భేటీ

ఆర్టీసీ సమస్యలపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కార్మికులు తలపెట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ కార్మిక మిగతా..2లో

## ప్రజలను గాలికి వదిలేసినట్లుగా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది



**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందన్న రేవంత్ రెడ్డి**

**కుటుంబ పెద్దే నిస్సహాయత వ్యక్తం చేస్తే పరిస్థితి ఏమిటన్న బండి సంజయ్**

**రాష్ట్రానికి రూ. 7 లక్షల కోట్ల అప్పు ఉందనే విషయం కాంగ్రెస్ కు ముందే తెలుసని వ్యాఖ్య**

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రానికి అప్పు పుట్టడం లేదని, మిగతా..2లో

## సోలార్ విద్యుత్ మాకు కుదించకండి..
## కేంద్రమంత్రితో భట్టి

ఢిల్లీ : ఢిల్లీ : పీఎం కుసుమ్ పథకం కింద తెలంగాణతో కుదుర్చుకున్న 4వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందాన్ని కొనసాగించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. తెలంగాణలో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను ఇప్పటికే చేపట్టింది. ముఖ్యంగా, మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా రాష్ట్రం పెట్టుకుంది.



## ఉగ్రవాదంపై పోరాడండి..
## మీ వెనక మేం ఉంటాం: భారత్ కు అమెరికా హామీ

మొదటి పేజి తరువాయి

భారత్ తమకు అత్యంత కీలకమైన భాగస్వామి అని ఆయన అభివర్ణించారు. సోమవారం క్యాపిటల్ హిల్‌లో జరిగిన కాంగ్రెషనల్ బ్రీఫింగ్‌లో జాన్సన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సీమాంతర ఉగ్రవాదంతో దశాబ్దాలుగా సతమతమవుతున్న భారత్‌కు ఏం సందేశం ఇస్తారన్న ప్రశ్నకు మైక్ జాన్సన్ స్పందిస్తూ.. "భారత్‌లో జరుగుతున్న పరిణామాలపై మాకు పూర్తి సానుభూతి ఉంది. మిత్రదేశాలకు అండగా నిలవాలని మేము కోరుకుంటున్నాం. భారత్ మాకు చాలా ముఖ్యమైన భాగస్వామి. ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు సఫలీకృతం అవుతాయని ఆశిస్తున్నాను" అని తెలిపారు. "ఉగ్రవాదంపై పోరులో భారత్ కు అమెరికా చేయగలిగినదంతా చేస్తుంది" అని ఆయన అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగినప్పుడు (ఏప్రిల్ 22) కూడా అమెరికా నేతలు మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌లతో మాట్లాడి సంఘీభావం తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో సహకారం అందిస్తామని, దాడికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు పూర్తి మద్దతు ఇస్తామని వారు హామీ ఇచ్చారు. ఉద్రిక్తతలు తగ్గించుకొని, శాంతిని కాపాడేందుకు పాకిస్థాన్‌తో కలిసి పనిచేయాలని కూడా రూబియో సూచించినట్లు అప్పటి స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి తెలిపారు.

## పంజాబ్ లో ఉగ్రకుట్రను భగ్నం చేసిన పోలీసులు

మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో కేంద్ర హెూంశాఖ నిన్న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రజలంతా స్వీయరక్షణ చర్యలపై దృష్టి సారించాలని, అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని సూచించింది. ఇందులో భాగంగా రేపు దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించాలని కోరింది.ఇదే సమయంలో, ఉగ్రవాద కార్యకలాపాలపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. పంజాబ్‌లోని అటవీ ప్రాంతానికి సమీపంలో ఉగ్ర కదలికలపై సమాచారం అందుకున్న పోలీసులు, విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సోదాల్లో భారీగా గ్రెనేడ్లు, ఐఈడీలతో పాటు ఉగ్రవాదులు ఉపయోగించే వైర్‌లెస్ కమ్యూనికేషన్ హార్డ్‌వేర్‌ను స్వాధీనం చేసుకుని, ఉగ్ర కుట్రను భగ్నం చేసినట్లు అధికారులు వెల్లడించారు. పంజాబ్‌లో స్లీపర్ సెల్స్‌ను తిరిగి క్రియాశీలం చేసేందుకు పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న ఉగ్రవాద సంస్థలు ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర డీజీపీ తెలిపారు. మరోవైపు, కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో ఉగ్రవాదులకు సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను భద్రతా సిబ్బంది అరెస్టు చేసి, వారి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల కుప్వారా జిల్లాలోనూ భద్రతా బలగాలు ఓ ఉగ్ర స్థావరాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.మరోవైపు, కేంద్ర హెూంశాఖ తన ఆదేశాల్లో భాగంగా, వైమానిక దాడులను హెచ్చరించే సైరన్ వ్యవస్థల పనితీరును సరిచూసుకోవాలని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. అత్యవసర సమయాల్లో, ముఖ్యంగా శత్రు దాడుల వంటివి జరిగినప్పుడు ప్రజలు ఎలా స్పందించాలి, స్వీయ రక్షణ చర్యలు ఎలా పాటించాలనే దానిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించింది. ప్రజల్లో ఆందోళన తగ్గించి, వారిని సమాయత్తం చేసేందుకు రేపు మాక్‌డ్రిల్ నిర్వహించాలని కోరింది. ఈ మాక్‌డ్రిల్‌లో విద్యా ర్థులు, యువతను కూడా భాగస్వాములను చేయాలని హెూంశాఖ తెలిపింది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత దేశంలో మరిన్ని దాడులకు ఆస్కారం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలోనే ఈ భద్రతా చర్యలు చేపట్టి నట్లు తెలుస్తోంది. దీంతో దేశవ్యాప్తంగా భద్రతా బలగాలు, పోలీసులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరి స్తున్నారు. గగనతల దాడుల వంటివి జరిగితే ప్రజలు ఆందోళనకు గురికాకుండా ఎలా వ్యవహరించాలి, సైరన్ మోగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల వంటి అంశాలపై ఈ మాక్‌డ్రిల్‌లో దృష్టి సారిస్తారు.

## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు జడ్జి సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) రిజర్వేషన్లకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, జస్టిస్ సూర్యకాంత్ ఈ ఏడాది చివర్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు చివరిసారిగా 2016-17లో జరిగాయి. ఓబీసీ కోటాకు సంబంధించిన న్యాయ పోరాటం కారణంగానే ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2021లో, ఓబీసీలకు 27 శాతం కోటా అమలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనంపై కచ్చితమైన గణాంకాల సేకరణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు, కమిషన్ సిఫార్సుల మేరకు రిజర్వేషన్ల శాతం నిర్ధారణ, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ రిజర్వేషన్లు మొత్తం 50 శాతానికి మించరాదనే త్రివిధ సూత్రాన్ని అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించింది. అప్పటి నుంచి గణాంకాల సేకరణ, సంబంధిత వ్యాజ్యాల వల్ల ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది ఇందిరా జైసింగ్, ఓబీసీలను గుర్తించినప్పటికీ, ఆ డేటాను స్థానిక ఎన్నికలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఎన్నికలను త్వరగా నిర్వహించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన ఆమె, రాష్ట్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారుల ద్వారా స్థానిక సంస్థలను ఏకపక్షంగా నడిపిస్తోందని ఆరోపించారు.

## కార్పొరేట్ ప్రీస్కూల్స్‌కు దీటుగా అంగన్వాడీలు..
## మీ పిల్లలను చేర్పించండి: మంత్రి సీతక్క

మొదటి పేజి తరువాయి

అంగన్వాడి చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే కి ముఖ్యఅతిథిగా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరయ్యారు. ప్రీ ప్రైమరీ విద్యను పూర్తి చేసుకున్న అంగన్వాడి చిన్నారులకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించిన టీచర్లకు సిబ్బందికి అభినందనలు తెలిపారు. చిన్నారుల చిరునవ్వులకు చిరునామాగా అంగన్వాడి కేంద్రాలు నిలుస్తున్నాయని చెప్పారు. చదువు, పోషకాహారంతో పాటు ఆరోగ్య సంరక్షణ.. అంగన్వాడీల ద్వారా అందిస్తున్నామని అన్నారు. అందుకే మీ పిల్లలందరినీ అంగన్వాడీలో చేర్పించాలని సూచించారు. నేటి చిన్నారులే.. రేపటి పౌరులు అని, మన దేశ భవిష్యత్తు చిన్నారుల చేతుల్లోనే ఉందన్నారు. అందుకే వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత అంగన్వాడి సిబ్బందిపై ఉందన్నారు. అంగన్వాడీల బలోపేతం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, అంగన్వాడీ లబ్ధిదారులకు మరిన్ని పోషకాలను అందిస్తామని వెల్లడించారు. ఇదిలా ఉండగా మినీ అంగన్వాడీ టీచర్లకు తాజాగా తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 3989 మినీ అంగన్వాడీ టీచర్లను మెయిన్ అంగన్వాడి టీచర్లుగా ప్రమోట్ చేసింది. ఇక నుంచి అంగన్వాడీ టీచర్ల మాదిరిగానే మినీ అంగన్వాడీ టీచర్లు వేతనం అందుకోనున్నారు. మినీ, మెయిన్ అంగన్వాడి అన్న తేడా లేకుండా ఇకపై అందరూ అంగన్వాడి టీచర్లేనని, ఈ నెల నుంచి అమల్లోకి ఉత్తర్వుల్లో తెలిపారు. ఏప్రిల్ మాసం నుంచి మినీ అంగన్వాడీ టీచర్లకూ నెలకు రూ.13,650, గతంలో మినీ అంగన్వాడీ టీచర్లకు నెల జీతం రూ.7800 ఉండేది. ఈ సందర్భంగా మినీ అంగన్వాడీ టీచర్లు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలను గాలికి వదిలేసినట్లుగా
## కాంగ్రెస్ వ్యవహరిస్తోంది

మొదటి పేజి తరువాయి



బ్యాంకులు తమను దొంగల్లా చూస్తున్నాయంటూ సీఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా పచ్చి అబద్ధాలు చెప్పడం సరికాదని హితవు పలికారు.ఎల్లారెడ్డిపేటలో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్... రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. ఢిల్లీ వెళితే ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్లు ఇవ్వలేదనడాన్ని ఆయన తోసిపుచ్చారు. ఈయన అప్పు కోసం వెళితే చెప్పులు ఎత్తుకెళ్లేవాడిలా చూస్తున్నారట... అది బహుశా కాంగ్రెస్ సంస్కృతేమోనని ఎద్దేవా చేశారు. ఇలాంటి వ్యాఖ్యలతో సీఎం రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చుతున్నారని విమర్శించారు.ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు ధైర్యం చెప్పాల్సిన ముఖ్యమంత్రే స్వయంగా రాష్ట్రం దివాళా తీసిందంటూ వారిలో భయాందోళనలు రేకెత్తించడం ఏమిటని సంజయ్ ప్రశ్నించారు. కుటుంబ పెద్దే ఇలా నిస్సహాయత వ్యక్తం చేస్తే పరిస్థితి ఏంటని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నడపలేమనే స్థితికి వచ్చిందని, చేతులెత్తేసిందని ఆయన ఆరోపించారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలను గాలికి వదిలేసినట్లుగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని అన్నారు.రాష్ట్రంపై రూ. 7 లక్షల కోట్ల అప్పు ఉందని ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీకి తెలుసని బండి సంజయ్ గుర్తుచేశారు. అప్పుల విషయం తెలిసి కూడా ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను దారుణంగా మోసం చేశారని ఆయన ఆరోపించారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేమని సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యల ద్వారా పరోక్షంగా అంగీకరించారని సంజయ్ వ్యాఖ్యానించారు. వృద్ధులకు రూ. 4 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ. 2,500, తులం బంగారం, నిరుద్యోగులకు రూ. 4 వేల భృతి, విద్యార్థులకు రూ. 5 లక్షల భరోసా వంటి హామీలన్నీ ఉత్తమాటలేనని ఇప్పుడు తేలిపోయిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని చేతబట్టి రాహుల్ గాంధీ ఇచ్చిన హామీల సంగతేంటని ప్రశ్నించారు. ఈ హామీల అమలు విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యంగా రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు వెంటనే సమాధానం చెప్పి తీరాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కథ 'ఖేల్ ఖతం.. దుకాణ్ బంద్' అన్నట్లుగా ఉందని, సీఎం వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇలాంటి మోసపూరిత కాంగ్రెస్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని బండి సంజయ్ హెచ్చరించారు.

# పదేళ్ళలో మీరు చేయలేనివి 16 నెలల్లో మేము చేసి చూపించాం

మొదటి పేజి తరువాయి

బడుగు బలహీన వర్గాల కోసం గత 14 దశాబ్దాలుగా పాటు పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గరిక లాంటిది ఎంత తరిగిన అంత పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్రోద్యమం నుండి నేటి వరకు అభివృద్ధి చేసిందన్నారు. కొన్ని ప్రాంతీయ పార్టీలు వచ్చి తారాజువ్వలుగా ఎగిసి వెంటనే నేల రాలుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఒడిదుడుకులు చూసింది. ఎన్ని వచ్చినా ఖర్గే, రాహుల్, మహేష్ గౌడ్ ఇలా అనేక మంది కష్టపడుతున్నారని వారి కష్టం వృధా కాకూడదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో గొడవలు టీ కప్పులో తుఫాను లాంటివి అని తెలిపారు. వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు నాయిని.రాజేందర్ రెడ్డిని ఖమ్మం జిల్లాకు ఇంచార్జ్ గా నియమించారని, సుదీర్ఘంగా పార్టీలో పదవులు అనుభవిస్తున్న వారు తప్పుకొని కొత్తవారికి అవకాశం ఇవ్వాలని దాని ద్వారా పార్టీ బలోపేతం చేయాలని సూచించారు. మేము ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తాం.. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కుటుంబం తప్పును, ఒప్పుగా, ఒప్పును తప్పుగా చూపించాలనుకోవడం దారుణమన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులను రెచ్చగొట్టి తెలంగాణలో అభద్రత సృష్టించడం తగదని అన్నారు. గత ప్రభుత్వం చేసిన 8 లక్షల కోట్ల రూపాయల అప్పును ప్రభుత్వం బయట పెట్టడం చిన్నతనం ఎలా అవుతుందన్నారు. ప్రపంచంలో 8వ వింతగా కాళేశ్వరం ప్రాజెక్టని మీరే చెప్పారుగా అటువంటి ప్రాజెక్టు కూలిపోతే కూలిపోయిందని చెప్పడం తప్పా అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఉన్న అప్పులను ప్రజలకు చూపెడతామని ఆది తమరి ఘనకార్యం అని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో రహస్యాలు ఉండవు.. మా ప్రభుత్వం తెరిచిన పుస్తకమని



అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు చేశామని తెలిపారు.25 లక్షల 60 వేల మంది రైతులకు రుణమాఫీ చేశాం. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇస్తున్నాం. పదేళ్ళలో మీరు చేయలేనివి 16 నెలల్లో మేము చేసి చూపించాం, ఇందిరమ్మ ప్రభుత్వంలో భూభారతి చట్టం తీసుకొచ్చి రైతులకు అండగా ఉన్నాం. ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ప్రతి నియోజకవర్గానికి తొలి విడత 3500 ఇండ్లు ఇస్తున్నాం అన్నారు. అలాగే నిరుద్యోగులకు 50,000 ఉద్యోగాలు ఇచ్చాం, ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉందని అన్నారు.ఖమ్మం జిల్లా ఇంచార్జ్ గా వచ్చిన హనుమకొండ ఎమ్మెల్యే నాయిని.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ గుజరాత్ రాష్ట్రంలో పార్టీ కమిటీలను పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారిని పార్టీ మండల, బ్లాక్, నియోజకవర్గ, జిల్లా పదవులకు నియమించాలని ప్రయోగాత్మకంగా పార్టీ నిర్మాణం చేశారని అదే విధంగా ఇక్కడ కూడా పార్టీ కోసం అన్ని పనులను పక్కన బెట్టి కష్టపడే వారికి పదవులు ఇవ్వాలని అన్నారు. వేరే పనులు ఉన్నవారు పదవుల నుంచి తప్పుకొని కొత్త వారికి అవకాశం ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో పథకాలు చేసి కూడా చెప్పుకోలేక పోతుందని కార్యకర్తలు, నాయకులు ప్రజా క్షేత్రంలో ప్రతి పక్షాల విమర్శలను తిప్పి కొట్టాలని సూచించారు. ఒక నెల రోజుల్లో పార్టీ పదవులు కావాల్సిన వారు పార్టీ పార్మేట్ లో ధరఖాస్తు చేయాలని గ్రామం, మండలానికి ఒకరి నుంచి ఐదుగురి వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యా లయంలో నాలుగు మండలాల నాయకులతో మండలాల వారీగా విడివిడిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్ రాయల.నాగేశ్వరరావు, మద్దినేని.స్వర్ణకుమారి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని.లక్ష్మినారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ చావా.శివరామకృష్ణ, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెన్నపూసల.సీతారాములు, పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ బత్తిన.శ్రీనివాస మండల పార్టీ అధ్యక్షుడు మట్టే.గురవయ్య, సీడీసీ చైర్మన్ యరబోలు. సూర్య నారాయణ రెడ్డి, రామసహాయం.నరేష్ రెడ్డి, మాజీ ఎంపీపీలు నియో జకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించింది

మొదటి పేజి తరువాయి

ఎల్జీ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఎల్జీ సంస్థ శ్రీసిటీలో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌లో ప్రధానంగా ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కండీషనర్‌లతో పాటు ఇతర అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేయనుంది. అంతేకాకుండా, ఉత్పత్తులకు అవసరమైన కంప్రెసర్, మోటార్ కంప్రెసర్, హీట్ ఎక్స్ఛేంజర్ వంటి కీలక విడిభాగాలను కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే తయారుచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధాన యూనిట్‌తో పాటు, రూ.839 కోట్ల వ్యయంతో మరో ఐదు అనుబంధ యూనిట్లను కూడా రానున్న ఆరేళ్లలో నెలకొల్పనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ లో ఎల్జీ కంపెనీ ప్రతినిధుల బృందంతో మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, రాయలసీమను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలను వారికి వివరించారు. ప్రభుత్వ చొరవ, కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సానుకూలంగా స్పందించిన ఎల్జీ ఎలక్ట్రానిక్స్, రాష్ట్రంలో తమ యూనిట్‌ను స్థాపించేందుకు ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు, రాయితీలను కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ప్రభుత్వం మంజూరు చేయడం విశేషం. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, గత 11 నెలల్లో వివిధ సంస్థలతో సుమారు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాల కల్పనకు సంబంధించిన అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు) కుదిరినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆర్సెలర్ మిట్టల్, బీపీసీఎల్, టీసీఎస్, ఎన్టీపీసీ, టాటా పవర్, రిలయన్స్ సీబీజీ ప్లాంట్స్ వంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించాయి. ఇటీవల కృష్ణా జిల్లా మల్లవల్లిలో హిందూజా గ్రూప్ అశోక్ లేలాండ్ వాహన తయారీ యూనిట్ ఉత్పత్తిని ప్రారంభించగా, ప్రకాశం జిల్లా కనిగిరిలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు కూడా భూమిపూజ జరిగింది. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్థిక అభివృద్ధి మండలి (ఈడీబీ)ని బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు. అమెరికా, దావోస్ వంటి అంతర్జాతీయ వేదికలపై పారిశ్రామికవేత్తలతో సమావేశమై, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించి, వారిని ఆహ్వానించడంలో మంత్రి లోకేశ్ క్రియాశీలక పాత్ర పోషించారు.

## సోలార్ విద్యుత్ మాకు కుదించకండి.. కేంద్రమంత్రితో భట్టి

మొదటి పేజి తరువాయి

సోలార్ పవర్ విషయంలో కేంద్ర ?ప్రభుత్వం కూడా నూతన పాలసీ తీసుకురావడంతో దానిపై తెలంగాణ ప్రత్యేక దృష్టి సారించింది. రైతుల ద్వారా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి సాధించేందుకు గాను వారికి పెద్ద ఎపంపులను తుస సోలార్ పెట్టించాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. అయితే, కేంద్రం 4 వేల మెగావాట్ల నుంచి వెయ్యి మెగావాట్ల వరకు కుదించినట్లు తమకు సమాచారం అందిందని చెప్పారు. ఈ విషయంపైనే కేంద్రమంత్రి ప్రహ్లాద జోషితో చర్చించినట్లు భట్టి తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ముందుగా ప్రకటించిన 4 వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందం కొనసాగేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటికే మహిళా స్వయం సహాయక బృందాలతో 1000 మెగా వాట్ల విద్యుత్ కోసం ఎమ్ఓయూ ద్వారా ఒప్పందం చేసుకున్నామని ఆయన గుర్తుచేశారు.

## తెలంగాణలో ప్రయాణికులకు ఊరట.. ఆర్టీసీ సమ్మె వాయిదా

మొదటి పేజి తరువాయి

సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, తమ దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మే 6వ తేదీ అర్ధరాత్రి వరకు ప్రభుత్వం నుంచి చర్చలకు ఆహ్వానం అందకపోతే, మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు కార్మికులు భారీ కవాతు నిర్వహించారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ప్రభుత్వం చొరవ తీసుకుని జేఏసీ నేతలను చర్చలకు ఆహ్వానించింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జేఏసీ నేతలు జరిపిన సమావేశంలో కార్మికుల సమస్యలు, డిమాండ్లపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా, ఉద్యోగుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార మార్గాలను సూచించేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కమిటీలో నవీన్ మిట్టల్, లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్ సభ్యులుగా వ్యవహరిస్తారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఈ కమిటీ చర్చలు జరిపి, వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించడం, సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయడంతో జేఏసీ నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ నివేదిక వచ్చే వరకు సమ్మెను వాయిదా వేస్తున్నట్లు వారు ప్రకటించారు. ప్రభుత్వ చర్యతో ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

తాత్కాలిక వాయిదా మాత్రమే

సమ్మె నిర్ణయం తాత్కాలిక వాయిదా మాత్రమేనని ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఉద్యోగ భద్రత, ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల అంశం, కారుణ్య నియామకాలు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలు, వేతన సవరణ తదితర అంశాలపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చిందని జేఏసీ నేతలు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చేలా, దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సమ్మెను కొంతకాలం పాటు వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

## గుర్తు పెట్టుకో.. ముమ్మాటికి మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది

మొదటి పేజి తరువాయి

ఇక నుంచి కేసీఆర్ గారిని వ్యక్తిగతంగా దూషిస్తే మాత్రం నీ నాలుక చీరేసే రోజు వస్తుంది. తప్పకుండా గుర్తు పెట్టుకో. ముమ్మాటికి మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. నీ దిక్కుమాలిన పరిపాలన వల్ల అతలాకుతలమైన రాష్ట్రాన్ని గాడిన పెట్టే నాయకుడు కేసీఆర్ మాత్రమే" అని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డికి చేతకాకుంటే అడ్డమైన హామీలు ఇచ్చినందుకు క్షమాపణ చెప్పి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్, ఢిల్లీ పార్టీలను నమ్మవద్దని ప్రజలకు పదేపదే చెప్పారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ చేసిన ఈ హెచ్చరికలు నేడు అక్షర సత్యాలుగా నిలుస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పరిపాలన బాధ్యతలు నిర్వర్తించడం చేతకాక, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతల నుంచి తప్పుకునేలా వ్యవహరిస్తున్నారని, ఆయన కాడి కిందపడేశారని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని కూడా కేటీఆర్ హెచ్చరించారు. "నిన్నటి ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డి అత్యంత అసమర్థ, దక్షతలేని సీఎంగా స్పష్టమైంది" అని కేటీఆర్ అన్నారు. గత ఏడాదిన్నర కాలంగా తమను, తమ నాయకుడిని వ్యక్తిగతంగా ఎంత దూషించినా సహించామని కేటీఆర్ అన్నారు. అయితే, వేలాది మంది త్యాగాలు, దశాబ్దాల పోరాటాల ఫలితంగా, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, చివరకు కేసీఆర్ నాయకత్వంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు శాపం పెట్టేలా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆవేదన కలిగించాయని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై కచ్చితంగా స్పందించాలని కేసీఆర్ ఆదేశించినట్లు చెప్పారు. మూడేళ్ల క్రితం వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ పేరిట రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలకు పెంపు, కౌలు రైతులకు రైతుబంధు వంటి హామీలిచ్చారని, వాటిలో ఏ ఒక్కటీ ఇంతవరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నేతలు కూడా ఊహించలేదని, అందుకే అడ్డగోలు హామీలిచ్చి ఇప్పుడు వాటిని నెరవేర్చలేక, ఏం చేయాలో తెలియక ముఖ్యమంత్రి ఫ్రస్ట్రేషన్‌తో మాట్లాడుతున్నారని కేటీఆర్ అన్నారు.

## దేవాదాయ శాఖలో ఉద్యోగాల భర్తీకి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజి తరువాయి

ఇక, మరో 200 వైదిక సిబ్బంది కొలువుల నియామకాలకు సైతం అంగీకారం లభించింది. కొత్తగా 16 ఆలయాల్లో నిత్యాన్నదాన పథకం అమలు చేస్తున్నారు. దీంతో 23 ప్రధాన ఆలయాలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి అని సీఎం సూ చించారు. అయితే, ఆగమశాస్త్రం ప్రకారమే ఆలయాల అభివృద్ధి పనులు చేప ట్టాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా డెవలప్మెంట్ కార్య క్రమా లు చేపట్టాలి అని సూచించారు. దేవాలయ భూముల్లో శాఖాహార హెూటళ్లకు మాత్రమే అనుమతి ఇవ్వాలని తెలిపారు. దేవాదాయ శాఖపై సమీక్షలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

## దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా అమరావతి

మొదటి పేజి తరువాయి

ధీమా వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇవాళ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయని, ప్రపంచానికి ధీటైన రాజధాని నిర్మాణానికి ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రూ.49 వేల కోట్ల విలువైన 74 పనులకు శంకుస్థాపన చేయడం, కేంద్ర ప్రభుత్వం అమరావతి పునఃనిర్మాణానికి సంపూర్ణ మద్దతు ప్రకటించడం రాష్ట్ర అభివృద్ధికి శుభపరిణామమని శ్రీదేవి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసికట్టుగా ఈ పనులు పూర్తి చేయాలని ప్రధాని సూచించారని గుర్తుచేశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి కూడా అమరావతి నిర్మాణంలో కీలకమని ప్రశంసించారు. గత వైసీపీ ప్రభుత్వంపై శ్రీదేవి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "జగన్మోహన్ రెడ్డి తన పాలనలో అమరావతిని ధ్వంసం చేసి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. 'మాట తప్పను, మడమ తిప్పను' అని చెప్పి అమరావతి విషయంలో మాట మార్చారు" అని ఆరోపించారు. మద్యం కుంభకోణాలతో రాష్ట్రాన్ని దోచుకున్నారని, రుషికొండపై అనవసర వ్యయం చేశారని ధ్వజమెత్తారు. దళిత రాజధానిగా రూపుదిద్దుకోవాల్సిన అమరావతిని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. "అమరావతి 2.0 కింద 17 కీలక ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యాయి. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తిచేయడంతో పాటు, నూతన ఐకానిక్ భవనాలను నిర్మిస్తాం" అని శ్రీదేవి వివరించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు, హ్యాపీనెస్ట్ వంటి ప్రాజెక్టులు రూపుదిద్దుకోనున్నాయని తెలిపారు. అమరావతిలో అందుబాటులో ఉన్న రెండు లక్షల కోట్ల విలువైన మిగులు భూమి ద్వారా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి పునర్నిర్మాణం వేగంగా జరుగుతుందని, రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తుందని శ్రీదేవి విశ్వాసం వ్యక్తం చేశారు. "చంద్రబాబు రాత్రింబవళ్లు రాజధాని కోసం శ్రమిస్తున్నారు. బహుశ ఆయన పడుకునేది రోజుకి 4 గంటలు మాత్రమే. ఈ వయసులో కూడా ఆయన ఎంతో కష్టపడుతున్నారు. అందరూ అలా కష్టపడలేరు. ఆయన ఒక విజనరీ లీడర్. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు అమరావతి రాజధాని నిర్మాణానికి అందరూ కలసి మెలసి భుజం భుజం కలిపి ముందుకెళ్లాలి. సౌత్ ఇండియాలో బెస్ట్ క్యాపిటల్ గా మారాలి. అమరావతి మహిళా రైతుల కృషి కూడా మరువలేనిది. వైసీపీ హయాంలో ప్రజలకు చెందాల్సిన వాటి గురించి ప్రజా ప్రతినిధిగా వెళ్లి అడిగితే విలువ లేకుండా పోయేది. కాని నేడు ఆ పరిస్థితులు లేవు. అడిగకముందే సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయి" అని ఉండవల్లి శ్రీదేవి తెలిపారు.

## ఓబుళాపురం మైనింగ్ కేసు -
## గాలి జనార్దన్‌రెడ్డిని దోషిగా తేల్చిన సీబీఐ కోర్టు..

మొదటి పేజి తరువాయి

ఏ4 ఓఎంసి కంపెనీ, ఏ7 మె ఫజ్ అలీఖాన్‌ను దోషులుగా నిర్ధారించింది. దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఓబుళాపురం మైనింగ్ కేసులో కోర్టు 15 ఏళ్ల విచారణ అనంతరం తుది తీర్పు ఇచ్చింది నాంపల్లి సీబీఐ కోర్టు. ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. గాలి జనార్దన్‌రెడ్డిని దోషిగా తేల్చింది. బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్‌గా ఉన్న వీడీ రాజగోపాల్‌ను కూడా దోషులుగా ప్రకటిస్తూ.. శిక్షలు ఖరారు చేసింది. వీరికి 7 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంలను నిర్దోషిలుగా ప్రకటించింది. ఓఎంసీ ఆక్రమణలు, అక్రమ మైనింగ్‌పై 2009లో అప్పటి ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సీబీఐ విచారణకు ఆదేశించింది కేంద్రం. 2007 జూన్ 18న అనంతపురం జిల్లాలోని ఓబుళాపురం దగ్గర 95 హెక్టార్లలో గాలి జనార్దన్‌రెడ్డి కంపెనీకి ఇనుప ఖనిజం గనుల లీజులు కట్టబెట్టింది అప్పటి వైఎస్ ప్రభుత్వం. అయితే, ఇనుప ఖనిజం తవ్వకాలు, రవాణా-అమ్మకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు రావడంతో 2009 డిసెంబర్ 7న కేసు నమోదు చేసింది సీబీఐ. 2011లో మొదటి ఛార్జిషీట్ దాఖలు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి, మెఫజ్ అలీఖాన్, సబితా ఇంద్రారెడ్డి, వీడీ రాజగోపాల్, కృపానందం, బీవీ శ్రీనివాసరెడ్డిలను ఛార్జిషీట్‌లో నమోదు చేసింది. మొత్తం 4 అభియోగపత్రాల్లో 9 మందిని నిందితులుగా చేర్చింది. ఓఎంసీ యజమానులైన గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాస్‌రెడ్డితోపాటు అప్పటి గనులశాఖ మంత్రి అయిన సబితా ఇంద్రారెడ్డితోపాటు అధికారులైన కృపానందం, శ్రీలక్ష్మి, వీడీ రాజగోపాల్, లింగారెడ్డిపై అభియోగాలు నమోదు చేసింది. ఓఎంసీ ఉక్కు పరిశ్రమకు మాత్రమే ఇనుప ఖనిజం ఉపయోగించేలా మొదట ఫైల్ రూపొందించి.. తర్వాత ఉద్దేశపూర్వకంగా క్యాప్టివ్ అనే పదం తొలగించి జీవో ఇచ్చినట్టు ప్రధాన అభియోగం. అలాగే కేటాయించిన భూముల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరిపారని,. ఏపీ-కర్నాటక సరిహద్దు రాళ్లను మార్చడం.. సుగులమ్మ ఆలయాన్ని కూల్చడం.. అటవీ భూముల ఆక్రమణ.. అక్రమంగా ఇనుప ఖనిజాన్ని విదేశాలకు తరలించారని అభియోగాలు మోపింది. మే నెలలోగా విచారణ పూర్తిచేయాలన్న సుప్రీం ఆదేశాలతో.. వాదనలు ముగించి.. మంగళవారం తుది తీర్పు ఇచ్చింది నాంపల్లి సీబీఐ కోర్టు. ఈ కేసుకు సంబంధించి 2022లో ఐఏఎస్ శ్రీలక్ష్మిని కోర్టు డిశ్చార్జి చేసింది.

## భద్రతపై ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష.. అజిత్ దోవల్‌తో భేటీ

మొదటి పేజి తరువాయి

కేవలం 48 గంటల వ్యవధిలో వీరిద్దరూ భేటీ కావడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ చర్చలు దేశ భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా భారత్ కఠిన చర్యలు తీసు కుంటు ఒదన్న సంకే తాల మధ్య ఈ సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మరోవైపు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు కేంద్ర హెూంశాఖ కూడా చురుగ్గా వ్యవహరిస్తోంది. బుధవారం (మే 7న) దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. పౌరుల స్వీయరక్షణ, అత్యవసర సమయాల్లో స్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పించడమే ఈ మాక్‌డ్రిల్స్ ప్రధాన ఉద్దేశమని హెూంశాఖ వర్గాలు తెలిపాయి. అధికారులు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హెూంగార్డులు, ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, నెహ్రూ యువ కేంద్రాల ప్రతినిధులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను ఈ డ్రిల్స్‌లో భాగస్వాములను చేయనున్నారు.

## మహిళలు,విద్యార్థిని ల భద్రత కోసం శక్తి టీం ఏర్పాటు.




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల పట్టణంలో జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు రెండు శక్తి టీమ్స్ ప్రజలకు అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా శక్తి టీం సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు,దాడులు జరుగుతున్నాయని అన్నారు.ప్రభుత్వం మహిళల భద్రత కోసం శక్తి టీమ్స్ ఏర్పాటుచేసింది అన్నారు.విద్యార్థులకు సెలవులు కావడంతో వారి భద్రత కోసం ప్రభుత్వం పలు చర్యలకు శ్రీకారం చుట్టిందని అన్నారు.వేసవికాలం పిల్లలను ఇంట్లో పెట్టి తల్లిదండ్రులు పనులకు వెళతారని అన్నారు.ప్రస్తుత సమాజంలో పిల్లలు అధికంగా సెల్ ఫోన్ లకు అతుక్కుపోతున్నారని పేర్కొన్నారు.ప్రజలు అధికంగా జీవించే ప్రదేశాల్లో వారి భద్రత కల్పించేందుకు శక్తి టీం పనిచేస్తుందని అన్నారు.మహిళలు, విద్యార్థిని లు ఏ సమస్య వచ్చినా శక్తి టీం కు సమాచారం అందించాలని అన్నారు.ప్రతి ఒక్కరు శక్తి టీం యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు.సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా శక్తి టీం కు సమాచారం ఇవ్వాలని కోరారు.పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు ఉంటే ముందస్తుగా తెలియజేయాలని అన్నారు.నంద్యాల శక్తి టీం,నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం ర్యాలీలో పాల్గొన్నారు.

## అమరావతిలో ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ వెబ్ సైట్,
### లేబర్ డిపార్ట్‌మెంట్ వెబ్ సైట్ ను ప్రారంభించిన మంత్రి సుభాష్



(శుభోదయం న్యూస్) అమరావతి మే 06 మ్యాన్ పవర్ ఏజెన్సీలు అవకతవకలను ఇక ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమరావతిలో కార్మిక అండ్ ఫ్యాక్టరీల శాఖల అధికారులతో సమావేశమైన మంత్రి మ్యాన్ పవర్ ఏజెన్సీల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీల కింద పనిచేస్తున్న సిబ్బందికి కనీసం వేతనాలు కూడా చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కొంతమంది కాంట్రాక్టర్లు మ్యాన్ పవర్ కింద పని చేస్తున్న కార్మికులకు పీఎఫ్ లు కూడా కట్టడం లేదని మంత్రి ఆరోపించారు. ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్లో ప్రమాదాలను నివారించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని దీనిలో భాగంగానే థర్డ్ పార్టీ ఆడిట్లో ఏజెన్సీలకు అనుభవం ఉండి, అర్హతలు ఉండి కంప్యూటర్ ద్వారా కేటాయింపులు చేసి చెప్పే విధంగా ప్రతి ఏజెన్సీ ఉండాలని అధికారులను ఆదేశించారు. ముందుగా లేబర్ డిపార్ట్మెంట్ వెబ్ సైట్ తో పాటు ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ వెబ్ సైట్ ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 86 లక్షల మంది కార్మికులు వివిధ రంగాలలో పనిచేస్తున్నారని వారి అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉందని చెప్పారు. కష్టజీవులుగా చెప్పబడే కార్మికులను గత ప్రభుత్వం తీవ్రంగా మోసం చేయడంతో పని లేక రోడ్డున పడిన పరిస్థితులు కూడా ఉన్నాయని మంత్రి అన్నారు. ముఖ్యంగా గత సీఎం జగన్మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో కార్మికులను అణచివేతకు గురిచేశారని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పుడిప్పుడే కార్మికుల జీవనస్థితిగతులు మెరుగుపడుతున్నాయని చెప్పారు. ప్రధానంగా భవన నిర్మాణ కార్మికులు ఉచిత ఇసుకతో ప్రతిరోజు ఉపాధి పొందుతూ రెట్టింపు ఆనందంతో ఉన్నారనిచెప్పారు. ఇక అధికారులు ప్రభుత్వం కార్మికుల కోసం అందజేస్తున్న ప్రతి పథకాలపై కార్మికులకు అవగాహన పెంచాలన్నారు. చంద్రన్న బీమాలో ప్రతి కార్మికుడు నమోదయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రభుత్వం తీసుకువచ్చినా అనేక ఆధునిక విధానాలపై అధికారులు కార్మికులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ-శ్రమ్ పోర్టల్ లో కార్మికులను నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఐపి హోల్డర్స్ మరియు ఈ శరం హోల్డర్స్ సంఖ్యను పెంచాలని అధికారులని ఆదేశించారు.ప్రతి జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ డిస్పెన్సరీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు.లేబర్ డిపార్ట్‌మెంట్ మొబైల్ యాప్ ద్వారా ప్రజలు సేవలను మరింత సులభంగా పొందే అవకాశం ఉందని యాప్ పై ప్రజలకు పూర్తిస్తాయి అవగాహన పెంచలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" లక్ష్యంతో: వాట్సాప్ గవర్నెన్స్, ఏ వన్ టూల్స్,గ్రీవెన్స్ మేనేజ్‌మెంట్ వంటి ఫీచర్లను యాప్‌లో అనుసంధానం చేసిన ఈ ఆధునిక విధానం కార్మికులకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ కమిషనర్ ఆఫ్ లేబర్ శేషగిరి బాబు , అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ గంధం చంద్రుడు గారు, తదితర అధికారులు జే సి ఎల్, ఈసీఎల్ లు,ఫ్యాక్టరీస్ అధికారులు పాల్గొన్నారు.

## రైతులే స్వచ్ఛంధంగా పంట కాలువ పూడికతీత



చల్లపల్లి, (శుభోదయం న్యూస్): సాగునీటి సరఫరా సరిగాలేని పంట కాలువను రైతులే స్వచ్చందంగా ముందుకువచ్చి పూడికతీత పనులు చేపట్టారు. 9వ నెంబరు పంట కాలువ నుంచీ పాగోలు ఆయకట్టుకు సాగునీటి సరఫరా కోసం రైతులు జేసీబీ సహాయంతో మంగళవారం పూడికతీత పనులు చేశారు. కాలువ పూడుకుపోయి ఉండటం, గత కొన్నాళ్లుగా తవ్వకం పనులు చేపట్టకపోవటంతో స్వచ్ఛందంగా ముందుకువచ్చి సొంత ఖర్చులతో పనులు చేయించుకున్నట్లు రైతులు తెలిపారు. పాగోలు ఎంపీటీసీ మేకా సత్యనారాయణప్రసాద్(బంగారుబాబు), కె.కొత్తపాలెం నీటిసంఘం వైస్ చైర్మన్ మేకా శివప్రసాద్, రైతులు మట్టా కమలాకరరావు, నరేష్, దిరిశం ప్రకాశరావు, గూడవల్లి జయరాజు పనులు పర్యవేక్షించారు.

## అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించడమే
## శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ లక్ష్యం
### చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా: తాడివలస దేవరాజు




చీరాల, శుభోదయం న్యూస్: షుగర్ మరియు జ్వరాల స్పెషలిస్ట్ డాక్టర్ చిమటా దివ్య గారు ఎండీ జనరల్ డైబెటలజీ శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్లో పర్మినెంట్ గా 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించేదరు. ఓపి టైమింగ్ ఉ: 10 గంటల నుండి మా: 2 గంటల వరకు సాయంత్రం: 6 గంటల నుండి 9 గంటల వరకు చూడబడును.ఎమర్జెన్సీ కేసులు, యాక్సిడెంట్ కేసులు 24 గంటలు చూడబడును.ప్రత్యేకతలు: బిపి ,షుగర్ ,గుండె నొప్పి,నిమ్ము ,కిడ్నీలో రాళ్లకు, జీర్ణ కోశ వ్యాధులకు, కళ్ళ వాపు ఉన్న వారికి ప్రత్యేక చికిత్స డాక్టర్ చిమటా దివ్య గారు అందిస్తారు.తెల్ల కార్డు ఉన్నవారికి జనరల్, లాప్రోస్కోపీ ఆపరేషన్లు,హెర్నియా, ఎముకల ఆపరేషన్ లు, కిడ్నీ లో రాళ్లు ఉన్నవారికి ,చెవి ముక్కు ,గొంతు ఆపరేషన్ ఉచితముగా చేయబడును.మరిన్ని వివరాలకు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్, చీరాల. ఓపి సెల్ నెంబర్స్ 9000 808 198,789 789 0737.

## 7వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక కార్పొరేషన్
## చైర్ పర్సన్ శ్రీమతి సావిత్రి ఒంగోలు పర్యటన...



ఒంగోలు, శుభోదయం న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ శ్రీమతి సావిత్రి ఈనెల 7వ తేదీన ఒంగోలులో ప్రభుత్వ ఆర్ బి గెస్ట్ హౌస్ నందు అందుబాటులో ఉంటారు. ప్రకాశం జిల్లా పర్యటనలో బాగంగా ఆమె జిల్లాకు రానున్నారని మంగళవారం రజక విద్యా సేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు దేవలూటి శంకర్ ఒక ప్రకటన లో తెలిపారు. అలాగే మార్కాపురం పట్టణంలో కూడా 8వ తేదీన గురువారం పట్టణంలో ఉన్న బాయ్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ పక్కన ఉన్న పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ లో అందుబాటులో ఉంటారు. మార్కాపురం పట్టణం లోని రజక నాయకులు, చుట్టూ పక్కల ఉండే గ్రామాలలోని రజకులు, కార్యకర్తలు, ప్రకాశం జిల్లా లోని రజక సోదరి, రజక సోదరులు వారికీ ఏమైన సమస్యలు ఉంటే సావిత్రి దృష్టి కి తీసుకోనివెళ్ళవచ్చు, వినతి పత్ర%శీ% ఇవ్వవచ్చు, అని తెలిపారు. సావిత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు దృష్టి కి తీసుకొని వెళ్లి సమస్యలు పరిస్కారం అయ్యేలా కృషి చేస్తారు అని ఆయన తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూటమి ప్రభుత్వం రజకుల కోసం చేస్తున్న కార్యక్రమాల గురించి కూడా సావిత్రి ఈ సమావేశంలో రజకులకు వివరిస్తారు.

## కాంగ్రెస్ పార్టీ పట్టణ,మండల అధ్యక్షుల నియామకం
### మండల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసిన
### నియోజకవర్గ ఇన్చార్జ్ కె ఎస్ షాన్ వాజ్



నల్లచెరువు, మండలం రిపోర్టర్ – మాలిక్ బాషా, మే 06 (శుభోదయం న్యూస్) :రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కదిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులను నియమించింది.ఈ మేరకు నియామక పత్రాలను కదిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కేఎస్ షానవాజ్ కు పార్టీ అధిష్టానం అందజేసింది.ఈ సందర్భంగా మంగళవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మండలాల అధ్యక్షులకు ఇన్చార్జి కేఎస్ షానవాజ్ నియామక పత్రాలను అందజేశారు.ఇందులో భాగంగా కదిరి పట్టణ అధ్యక్షుడిగా షేక్ అల్లా బక్స్, కదిరి రూరల్



అధ్యక్షుడిగా మీసాల నాగేంద్ర, తలుపుల మండలం అధ్యక్షుడిగా అబ్దుల్ మునాఫ్, తనకల్లు మండలం అధ్యక్షుడిగా తోపు పారేసి,గాండ్లపెంట మండలం అధ్యక్షుడిగా చంద్రశేఖర్ నాయక్, నల్లచెరువు మండలం అధ్యక్షుడిగా బాబా ఫక్రుద్దీన్ లు నియామకమయ్యారు. ఈ మేరకు వారికి పార్టీ కార్యాలయంలో మంగళవారం నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా కదిరి నియోజకవర్గ ఇన్చార్జి కేఎస్ షానవాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలరెడ్డికి, సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డికి, డిసిసి అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలియజేశారు.పార్టీ బలోపేతం కోసం పట్టణ,మండల అధ్యక్షులు పనిచేయాలని గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలియజేశారు.కార్యక్రమంలో ఐ వై సీ రాష్ట్ర అధికార ప్రతినిధి సమీవున్న,డిసిసి ప్రధాన కార్యదర్శి జైనుల్లా,పట్టణ మైనార్టీ అధ్యక్షుడు జబివుల్లా,ఎన్ ఎస్ యు ఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్, నాగరాజు, వెంకటరమణ, సురేంద్ర, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి భవనం స్వాధీనం



నల్లచెరువు, మండలం రిపోర్టర్ – మాలిక్ బాషా, మే 06 (శుభోదయం న్యూస్) :మండల పరిధిలోని ఉప్పార్లపల్లి గ్రామంలో 2017లో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని మంగళవారం అధికారులు స్వాధీన పరుచుకున్నారు. 2017 సంవత్సరంలో ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వై. శ్రీధర్ రెడ్డి అంగన్వాడి భవనాన్ని నిర్మించారు.అప్పటినుండి భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో భవనానికి తాళం వేసి కాంట్రాక్టర్ తన వద్దని ఉంచుకున్నారు.అప్పటినుండి గ్రామంలో అంగన్వాడి భవనం అద్దె భవనంలో నడుపుతున్నారు. గ్రామస్తులు ఈ విషయాన్ని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు దృష్టికి తీసుకెళ్లగా అంగన్వాడీ భవనాన్ని స్వాధీన పలుచుకోవాలని మండల అధికారులకు శాసనసభ్యులు ఆదేశించారు. ఇందులో భాగంగా మంగళవారం శాసనసభ్యులు ఆదేశాల మేరకు తాసిల్దార్ రవికుమార్,మండల అభివృద్ధి అధికారి రఘునాథ్ గుప్తా,సిడిపిఓ జయంతి,ఐసిడిఎస్ సూపర్వైజర్ రఫీ మున్నీసా,ఐకెపి ఏపిఎం రమణప్ప,పోలీస్ సిబ్బంది తదితరులు గ్రామంలో సందర్శించారు.అనంతరం భవన నిర్మాణ కాంట్రాక్టర్ తో మాట్లాడి భవనంకు సంబంధించిన తాళాలను స్వాధీన పరుచుకున్నారు.భవనాన్ని తెరిపించి భవనానికి సంబంధించిన రికార్డులను అందజేస్తే తమకు రావలసిన బిల్లుల విషయాన్ని ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన కాంట్రాక్టు తాళాలను అధికారులకు అందజేశారు.అనంతరం భవనము శుభ్రపరచి అంగన్వాడి కేంద్రాన్ని నూతన భవనములో నడపాలని అంగన్వాడి కేంద్ర సిబ్బందికి అధికారులు ఆదేశించారు.భవనం నందు మూత్ర విసర్జనశాలలు, విద్యుత్, నీటి సౌకర్యం కలిగి ఉన్నందున వెంటనే భవనాన్ని ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బైకు యాక్సిడెంట్లో నారినాగేపల్లి ఓబులేసు మృతి
### కుటుంబ సభ్యులను పరామర్శించిన బిసివి అధ్యక్షులు శివరామకృష్ణ



శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్): శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం నర్నాగేపల్లి గ్రామానికి చెందిన యసి కులానికి చెందిన ఓబులేసు రెండు రోజుల క్రితం కర్ణాటకలోని తిరుమని ప్రాంతంలో బైక్ ప్రమాదంలో గాయపడి బెంగళూరు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. బెంగళూరు నుంచి నార్నేగి పల్లి గ్రామానికి మృతదేహాన్ని రాత్రి 11 గంటలకు తీసుకురాగా మరి అదే సమయంలోనే దహన సంస్కారాలు చేసిన విషయం తెలుసుకొని మంగళవారం బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ తన బృందంతో నారానాగేపల్లి వెళ్లి గ్రామంలో మృతుని భార్య,తల్లిని పరామర్శించి, ధైర్యం చెప్పి మృతుని కుమారుడు ఆరవ తరగతి చదువుతున్నాడు అనే విషయం తెలుసుకొని అబ్బాయికి తప్పకుండా రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకునే విధంగా అవకాశం కల్పించే భాధ్యత చైతన్య వేదిక తీసుకొంటుదని వారి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నార్నగేపల్లి సర్పంచ్ నాగార్జున, చైతన్య వేదిక గౌరవ అధ్యక్షులు రొద్దం బాబు ప్రసాద్, ప్రధానకార్యదర్శి పెనుకొండ రవికుమార్, చైతన్య వేదిక రాష్ట్ర మైనార్టీ లీడర్ ఆంధ్రూస్, బీసీవీ రామకృష్ణ, గ్రామ యువత పాల్గొన్నారు.

## మహిళాకాశం యాప్ పై ఒకరోజు శిక్షణ
### ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ రమేష్ కుమార్



శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో వై పోతులయ్య (శుభోదయం న్యూస్): హిందూపురం పట్టణంలో డి ఆర్ డి ఎ వెలుగు కార్యాలయం నందు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విశ్వజ్యోతి ఆధ్వర్యం లో మహిళాకాశం యాప్ మీద ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళాకాశం యాప్ ద్వారా సభ్యురాలి హాజరు, పొదుపు ఎంట్రీ, అప్పుల వివరాల ఎంట్రీ, జీవనోపాధుల వివరాలు, సంఘం లోను రిక్వెస్ట్ మరియు ఎడిట్ ఆప్షన్ మొదలగు వివరాలు అన్ని యాప్ లో ఉంటాయని,




కనుక మీరు క్షుణ్ణంగా శిక్షణ తీసుకొని, మీ రోజు వారి కార్యకలాపాలు అన్ని చేయడానికి ఈ యాప్ లో చాలా సులభతరం అవుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా జీవనోపాదుల అధికారి వాసుదేవరెడ్డి, జిల్లా ఐ.బి. భవాని, డి ఎం సి ఎల్.గంగులయ్య, టి ఎల్ ఎఫ్అధ్యక్షురాలు విజయలక్ష్మి, టిఎంసి రమాదేవి, సి ఓ లు నాగేశ్వరి, నాగేంద్ర, తౌసిఫ్, పరంజ్యోతి, వరలక్ష్మి, గంగరత్నమ్మ మరియు సాధికా పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : 2025-26 సంవత్సరానికి శ్రీకాళహస్తి నూతన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. వేదాం సమీపంలోని దక్షిణ కాళికామాత ఆలయంలో ప్రెస్ క్లబ్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా వేణు గోపాల్(సీవీఆర్ న్యూస్), ప్రధాన కార్యదర్శిగా కార్తీక్ నాయుడు(మహా న్యూస్), గౌరవాధ్యక్షులుగా వై.చంద్రయ్య(జీ న్యూస్), పీఆర్వోగా ఈశ్వర్(రాజ్ న్యూస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఏపీఆర్వోగా చందశేఖర్(ఆంధ్ర ప్రభ), కోశాధికారిగా వినయ్(ప్రైమ్ నైన్), ఉపాధ్యక్షులుగా నత్తం హరిబాబు(ఆంధ్ర నాడు), నాని(ఎన్ టీవీ), వెంకటేష్(ప్రజాశక్తి), కార్యనిర్వాహక కార్యదర్శిగా ధనశేఖర్(99 టీవీ), కార్యదర్శులు బి. రవి(మనం), అలీం(6 టీవీ), జుంలేషా(పబ్లిక్ టుడే), కాకి హరిబాబు(ఆంధ్ర పత్రిక), సంయుక్త కార్యదర్శులుగా బాలచంద్ర(రాజధాని న్యూస్), విజయ్(స్వర్ణసాగరం), బాబు(శుభోదయం), న్యాయ సలహాదారుగా కాకి అంకయ్య(సూర్య బెల్స్), సహాయ కార్యదర్శులుగా గంధం మునిచంద్ర(గరుడ దాత్రి), బాలాజీ(వీ-6), మునిరాజా(ఎస్వీ 99), సభ్యులుగా శివకుమార్, రామచంద్ర(ఉద్యమ కెరటం), పెంచలయ్య(ఆర్టీ న్యూస్), రఘు(సూర్య), నాగరాజు, విజయ్ భాస్కర్(నేటి మనదేశం), శేఖర్(కార్మికుల న్యూస్), హేమంత్ రెడ్డి(విహారి)లు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా ఏ. కామేష్ (ప్రజాశక్తి), బొమ్మినేటి హరిబాబు(ఆంధ్ర ప్రభ), బి. చంద్ర శేఖర్(బిగ్ టీవీ)లు ఎన్నుకోబడ్డారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 18వ తేదీన స్థానిక పంచాయతీరాజ్ అతిధి గృహంలో జరుగుతుంది.

## న్యాయవాది పులి శ్రీకాంత్ కు ఘన సన్మానం



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : న్యాయ సలహాలతో పాటు న్యాయ పోరాటానికి సిద్ధమైన దళిత సంఘ సీనియర్ నేత న్యాయవాది పులి శ్రీకాంత్ మంగళవారం దళిత సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు.శ్రీకాళహస్తిలోని ఆయన స్వగృహం నందు దళిత సంఘాల నాయకులు మంగళవారం కలిసి ఘనంగా సత్కరించారు.. దుశ్యాలవలతో పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలపడంతో పాటు అభినందించారు.. నూతన అడ్వకేట్ గా బాధ్యతలు చేపట్టిన అడ్వకేట్ పులి శ్రీకాంత్ని సన్మానించిన వారిలో దళిత సంఘం సీనియర్ నాయకులు డాక్టర్ అల్లం జయ కిరణ్,అల్లం మని, సుబ్బరామయ్య, కాంగ్రెస్, అంకయ్య, గాలి రవి, రామకృష్ణయ్య, దారా ఈశ్వర్, విష్ణువర్ధన రాజు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా తుగ్గలి లో జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల కేంద్రమైన తుగ్గలి లోనే జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2002బి2003 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. పదవ తరగతి చదివిన వారందరూ 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులు రామయ్య ,ఉస్మాన్ భాష, ఓబులేసు, శ్రీనివాసులు, కరుణకుమారి, ప్రమీలమ్మ తదితర గురువులకు పూర్వ విద్యార్థులు శాలువా పూలమాలతో సన్మానించి పాదాభివందనాలు చేసుకున్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కరుణ కుమారి మాట్లాడుతూ తనకు 22 సంవత్సరాల్లోనే ఉద్యోగం రావడంతో మొట్టమొదటి ఉద్యోగం తుగ్గలి జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా చేరానని, అప్పటి ప్రధానోపాధ్యాయులు సుంకన్న సూచనలు సలహాలతో తాను విద్యార్థులకు క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని నేర్పించానని గుర్తు చేశారు. విచిత్రం ఏమిటంటే ఈ స్టేజి మీద ఉన్న ఉపాధ్యాయులంతా తనకు చదువు చెప్పిన గురువులని, స్టేజ్ కింద ఉన్న వారికి తాను చదువు చెప్పానని ఆమె 22 సంవత్సరాల క్రితం జ్ఞాపకాలను గుర్తు చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు చదువు చెప్పిన అప్పటి విద్యార్థులు ప్రస్తుతం ఏ ఏ హోదాలో ఉన్నారో ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాలలో, మరికొందరు ప్రైవేటు ఉద్యోగాలలో, కొందరు వ్యాపారాలు చేసుకుంటూ, మరికొందరు వ్యవసాయం చేసుకుంటూ ఉన్నామని విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

## మందపల్లిలో అడంగల్ సమస్య పరిష్కారానికి కృషి : కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్



సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్ ): మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన 100 మంది రైతులకు అడంగల్ రావడం లేదన్న ఫిర్యాదుపై ప్రత్యక్షంగా వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ తెలిపారు. సిద్ధవటం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కడప ఆర్డీఓ రెవిన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి వారంలో ఒక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కారించాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించామన్నారు. మండలంలో భూ సేకరణకు సంబంధించి చాలా మంది రైతులకు ఇంకా పరిహారం అందలేదని వారికి సంబంధించిన డాకుమెంట్స్ తీసుకోవాల్సిందిగా సిబ్బందికి ఆదేశించామన్నారు. భూ సేకరణకు సంబంధించి పరిహారం అందని వారికి కూడా త్వరలోనే పరిష్కరించి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఏమైనా ప్రజల సమస్యలు ఉంటే సత్వరమే పరిష్కరించాలన్నదే జిల్లా కలెక్టర్ ఆదేశాలన్నారు. దానికి తగ్గట్టుగా ప్రతి వారం మండలాలకు వచ్చి వారి సమస్యలు విని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహసీల్దార్ మాధవి లత, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏనుగుల వలన పంట నష్టాన్ని పరిశీలించిన వినుత. కోటా



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : నియోజకవర్గంలోని రేణిగుంట మండలం,మామండూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా దాదాపు 150 ఎకరాల మామిడి తోటను,2 ఎకరాల అరటి తోటపై ప్రతి రోజూ ఏనుగుల గుంపు పడి విచ్చలవిడిగా పంట నష్టాన్ని కల్గిస్తున్నాయని తెలుసుకున్న వెంటనే శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా మామండూరు గ్రామానికి వెళ్లి అటవీ సమీప ప్రాంతంలో ఏనుగుల గుంపుకు నష్టపోతున్న రైతులతో కలిసి వారి పొలాలను పరిశీలించారు. గత కొన్ని రోజులుగా ఏనుగుల గుంపు వారి పొలాల్లో పడి బీబత్సం సృష్టిస్తున్నాయని, 25-30 సంవత్సరాలుగా పెంచిన 150 ఎకరాల మామిడి తోటలను 70 శాతం చెట్లు కొమ్మలు, వేర్లతో సహా విరిచేసి ధ్వంసం చేశాయని ఎంతో కష్టపడి నీళ్ళు పోసి కాపాడుకున్న మామిడి తోట ఏనుగుల గుంపు వల్ల ధ్వంసం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని, కాపుకు వచ్చిన మామిడి పంట మాత్రమే కాకుండా చెట్లు మొత్తం ధ్వంసం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు . ప్రతి రోజూ ఏనుగుల గుంపు పంటలను నాశనం



చేస్తున్నాయని, ఈ ఏనుగుల గుంపు సమస్యలను గౌరవ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లి అత్యంత ప్రాముఖ్యతతో పరిష్కరించాలని రైతులు శ్రీమతి వినుత కోటా ని కోరారు. 150 ఎకరాల మామిడి తోట, 2 ఎకరాల అరటి తోట, అటవీ ప్రాంతంలో ఉన్న కందకాలను ఆమె నేరుగా పరిశీలించారు. ఏనుగుల గుంపు వలన కల్గిన ధ్వంసాన్ని తక్షణమే ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ కి తెలియజేసి సత్వరమే పరిష్కార మార్గాన్ని చూపుతామని, జరిగిన పంట నష్టానికి, ఆస్తి నష్టానికి నష్ట పరిహారం అందేలా చేస్తామని, 2.5 కి.మీ. పొడవు గల కందకాలలో పూడికలు తీసి ఏనుగులను కట్టడి చేసేలా చర్యలు చేపడతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరఫున వినుత కోటా రైతులకు ధైర్యం చెప్పి, బరోసా కల్పించడం జరిగింది.

## పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి




(శుభోదయం న్యూస్) : రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం,పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షను రద్దుచేసి పాత పద్ధతుల్లో నిర్వహించాలి,పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే 107 108 జీవోలను రద్దు చేయాలి,యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ , బాపట్ల: రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఇచ్చినటువంటి హామీలో భాగంగా పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు, వైసీపీ ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులకు దూరం చేసే పద్ధతులలో జీవో నెంబర్ 77 తీసుకువచ్చి కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలు చదివే వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్మెంట్ పథకం వర్తింపజేస్తుందని ప్రైవేట్ విద్యాసంస్థల్లో పీజీ చేసే విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వర్తించదని జీవో నెంబర్ 77 తీసుకోవడం జరిగిందన్నారు, తక్షణమే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులతో కిటకిటలాడుతున్న యూనివర్సిటీలలో రాష్ట్రవ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తీసుకోవడం వల్ల యూనివర్సిటీలో విద్యార్థులు లేనటువంటి దౌర్భాగ్యమైనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొంది అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో బాగుపరచాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కామన్ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షను రద్దుచేసి ఏ యూనివర్సిటీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష హ యూనివర్సిటీ నిర్వహించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సందర్భంలో వైద్య విద్యను పేదలకు దూరం చేసే విధంగా జీవో నెంబర్ 107 108 తీసుకువచ్చి వైద్య విద్యను కోట్ల రూపాయలకు అమ్ముతుండడంతో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ జీవోలను రద్దు చేస్తూ ప్రతి పేద విద్యార్థికి వైద్య విద్యను అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తుకు చేశారు, తక్షణమే పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీవో నెంబర్ 107 108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వసతి దీవన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్న తూతూ మంత్రంగా 788 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి చేతులు దులుపుకుందన్నారు,, మాకు కావాల్సింది 788 కోట్లు కాదు 3580 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు దోపిడీ చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలను వేలాది రూపాయలకు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తున్నా కూడా కూటమి ప్రభుత్వం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు,రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకరం చుడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు డి.దిలీప్, తోకల విజయ్, సోమినేని సందీప్, మామిడిబత్తుల గణేష్ కతదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలి

### డాఎంగుదే రాజారావు, ఇన్చార్జి బహుజన సమాజ్ పార్టీ




(శుభోదయం న్యూస్) బాపట్ల : డాక్టర్ గుదే రాజారావు మాట్లాడుతూ, దళితులు క్రిస్టియన్ మతంలోకి మారిన మరుక్షణం ఎస్సీ హోదా కోల్పోతుందని గౌరవ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరం,ఏ మతంలోకి మారినా దళితులు అంటరానితనానికి,వివక్షతకు గురవుతూనే ఉన్నారు,క్రిస్టియానిటీ కులాన్ని గుర్తించకపోయినా కులవివక్ష కొనసాగుతున్నదని అనేక నివేదికలు వెల్లడించాయి. మన దేశంలో కులం మతంపై ఆధారపడిలేదు,వ్యవస్థీకృతమై ఉంది. కులం పునాదుల్ని తొలగించడానికి అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక చర్యల్ని తీసుకోవాలిలికాబట్టి దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలని బహుజన సమాజ్ పార్టీ కోరుకుంటుంది,అందుకు అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుంది. రాష్ట్రంలో మతం కులం పై ఆధారపడి దళితులపై వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు,క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ, ఎస్టీ నిరోధక చట్టం కింద ఫిర్యాదు చేయలేరని, ఒకవేళ ఆ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినా, అది చెల్లదని హైకోర్టు తేల్చి చెప్పింది,మతం మారిన మాత్రాన కులం మారిందా కులానికి మతానికి ముడి పెట్టొద్దని, ఎస్సీ ఎస్టీ అత్యాచార చట్టం నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని రానున్న కాలంలో దళిత క్రైస్తవులపై దాడులు,వేధింపులు, ఆర్థికంగా అణచడానికి ఈ సూచనలని బహుజన్ సమాజ్ పార్టీ తెలియజేస్తుంది ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి దళిత క్రైస్తవుల్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని,బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుంది.

## కదిరిలో నందు వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై సమావేశనికి బయలుదేరిన లేపాక్షి బీజేపీ నాయకులు.




లేపాక్షి మండల రిపోర్టర్ (అమరేష్ శు భోదయం న్యూస్ )వక్ఫ్ బోర్డు సవరణ చట్టం 2025పై కదిరిలో ఈరోజు ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు శ్రీ జి.యం. శేఖర్ గారి అధ్యక్షతన నిర్వహిస్తున్నరు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు మరియు వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రాయలసీమ ప్రోగ్రాం కన్వీనర్ శ్రీ కాపు రామచంద్ర రెడ్డి హాజరు కానున్నారు ఈ సమావేశంలో రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షులు శ్రీ షైక్ బాజి మరియు నంద్యాల జిల్లా ఇంచార్జ్ శ్రీ బ్రహ్మం కూడా పాల్గొన్నారు. లేపాక్షి మండలం నుండి బిజెపి అధ్యక్షులు ఎం. నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి నాగభూషణ, మండల ఉపాధ్యక్షులు ఆనందప్ప, శేఖర్ మరియు బిజెపి నాయకులు శ్రావణ్, అనిల్ కుమార్ ఈ సమావేశానికి తరలివెళ్లారు.

## నిలువ ఉన్న మురుగునీరు, ఆందోళనలో గ్రామ ప్రజలు



సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్ ( శుభోదయం న్యూస్) : నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు చాలామంది ప్రజలు అవస్థలు పడుతున్నారు మురికి నీరు తొలగింపు చర్యలు చేపట్ట చేపట్టకపోవడం విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని చంటిగారిపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాలనీలో గత కొన్ని రోజులుగా మురికిని నిలిచిపోయి దుర్వాసన పెద్దజల్లుతుండడంతో కాలనీవాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు సో కాకుండా మురికి నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని అధికారులకు కోరుచున్నారు అని చంటిగారిపల్లె ఎస్సి గ్రామ ప్రజలు తెలిపారు ఈ విషయంపై గ్రామపంచాయతీ సెక్రటరీ సంధ్యారాణి ఈ వివరణ కోరగా చంటి గారి పల్లె స్తంభించిన మురుగునీరు తొలగింపు చేపట్టి గ్రామంలో ప్రజలకు కాపాడాలన్నారు.

## ఈనెల 20న జరిగే సార్వత్రిక దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి! సిపిఎం పిలుపు



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని స్థానిక సిఐటియు నాయకులు టి రాము మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొనడం జరిగింది. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె జరుగుతుందన్నారు. ప్రధానంగా పెరుగుతున్న ధరలు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేయడం జరిగింది. కార్మికులకు నష్టం కలిగించి కార్పొరేటర్లకు ప్రయోజనం కలిగించే నాలుగు రకాల లేబర్ కోడ్ను రద్దు చేయాలని డిమాండ్ చేయటం జరిగింది.

## పదవ తరగతి ఫలితాలు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మనిస్తున్న నాగారం గ్రామస్తులు.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):బాన్సువాడ మండలం నాగారం గ్రామం లో పదవతరగతి పూర్తి చేసుకొని ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రామానికి అటు మండలానికి వన్నె తెచ్చిన విద్యార్థులను గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో బార్లం పిర్గొండ,మెహన్,గంగాధర్,శ్రవణ్,సంజీవ్ కుమార్,విఠల్, లక్ష్మణ్,రాజు,హనుమాన్లు మోహన్,శివ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీ 1 లోని పి.సి.పటేల్ కంపెనీలో విధులు నిర్వహిస్తూ ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ సూపర్ వైజర్ కు నష్ట పరిహారం 82 లక్షలు

### అంగీకరించిన సింగరేణి యాజమాన్యం మరియు, పి.సి.పటేల్ యాజమాన్యం



రామగుండం, తిరుపతి, (శుభోదయం న్యూస్) : మండలం రిపోర్టర్-తేదీ :5/5/2025 న సెకెండ్ షిఫ్ట్ లో వాటర్ టాంకర్ నడుపుతూ ప్రమాదానికి గురై వికాస్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, గోదావరిఖని పట్టణ కార్యదర్శి ఎం.సారయ్య, నాయకులు టి.నరహరి, ఆరెపల్లి రాజమౌళి సింగరేణి హాస్పిటల్ కు చేరుకుని ఇతర కార్మిక సంఘాల నాయకులతో కలిసి నిరసన తెలుపడం జరిగింది. అనంతరం హాస్పిటల్ లో చనిపోయిన కాంట్రాక్ట్ కార్మికుని కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియ, కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశం ఇవ్వాలని సీఐటీయూ ప్రతినిదులు, సింగరేణి యాజమాన్యం మరియు పి.సి.పటేల్ యాజమాన్యంతో నిన్న రాత్రి 2 గంటల వరకు చర్చలు జరిగాయి. చర్చలు విఫలం కావడంతో తిరిగి ఈరోజు ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో సీఐటీయూ నుండి టి.రాజ రెడ్డీ, వేల్పుల కుమారస్వామి, ఎం.సారయ్య,టి.నరహరి,అరెపల్లి రాజమౌళి, సింగరేణి యాజమాన్యం, మరియు పి.సి.పటేల్



యాజమాన్యం తో పాటు ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.ఈ చర్చల్లో కోటి రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలనీ, కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేయగా సింగరేణి, మరియు పి.సి.పటేల్ యాజమాన్యం తో 82 లక్షల రూపాయల (చట్ట బద్ధంగా రావాల్సిన హక్కులు వర్క్ మెన్ కాంపెన్ సేషన్, జనరల్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ క్రింద 32 లక్షలు, పి.సి. పటేల్ కంపెనీ స్పెషల్ ఎక్స్ గ్రేషియా క్రింద 10 లక్షలు రూపాయలు, మరియు పి.సి.పటేల్ యాజమాన్యం కార్మికునికి హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ అకౌంట్ తీయని కారణంగా దాని నుండి ఎన్ని లక్షలు నష్ట పరిహారం వచ్చిన సింగరేణి యాజమాన్యం పి.సి.పటేల్ యాజమాన్యం దగ్గర లీగల్ గా తీసుకుని కార్మికుని కుటుంబానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నష్ట పరిహారం ఇవ్వడానికి, కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశం కల్పించడానికి ముందుకు రావడంత అంగీకరించి అగ్రిమెంట్ పై సంతకాలు చేయడం జరిగింది.ఈచర్చల్లో సింగరేణి యాజమాన్యం నుండి అర్జీ 1 జీ.ఎం. డి.లలిత్ కుమార్,పర్సనల్ మేనేజర్, ఎస్ ఓ టు జిఎంలు, మరియు పీసీ పటేల్ యాజమాన్యం గౌర మనీష్, పెద్దపల్లి రవీందర్ లు పాల్గొన్నారు.

## పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామంలో "జై బాబు - జై భీమ్ - జై సంవిధాన్ "

### ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్



రామగుండం, మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) : రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామంలో జరగనున్న "జై బాబు జై భీమ్ జై సంవిధాన్" కార్యక్రమం ఏర్పాట్లను రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారి సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ పరిశీలించారు.ఈ సందర్భంగా వారు గ్రామ ప్రజలతో కలిసి ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములవ్వాలని ఆకాంక్షించారు.అలాగే, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను యువతలో నాటాల్సిన అవసరాన్ని వారు ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లకు సహకరించిన స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులను మనాలి రాజ్ ఠాకూర్ అభినందించారు.

## విశ్వ భారతి హై స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




గోదావరిఖని, టౌన్ రిపోర్టర్ - సురేష్, శుభోదయం న్యూస్ ): రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ మంగళవారం రోజున స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గోదావరిఖని విశ్వభారతి హై స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో 582 మార్కులతో టాప్ స్కోరర్ గా నిలిచిన విద్యార్థులను మరియు 500 పై చిలుకు మార్కులు సాధించిన వారిని అభినందించారు. విద్యార్థులు రానున్న రోజుల్లో ఉన్నత స్థానాల్లో




చేరాలని,సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యారంగంలో ఇటువంటి విజయాలు ప్రతి విద్యార్థిలోనూ నూతన ఉత్సాహాన్ని నింపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, వారికీ మరింత సహకారం అందించాలని నిర్ణయించారు.

## మే 20 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం
## ఆర్.జి 1 జనరల్ మేనేజర్ కు
## సమ్మె నోటీసు ఇచ్చిన జాయింట్ యాక్షన్ కమిటీ



గోదావరిఖని టౌన్ రిపోర్టర్– సురేష్, (శుభోదయం న్యూస్)తేదీ 06:05:2025 నాడు సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మే 20 సమ్మె సందర్భంగా సమ్మె నోటీసును అర్. జి టు జనరల్ మేనేజర్ కు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా హాజరైన సింగరేణి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఉల్లి మొగిలి, ఐ యఫ్ టు యు రాష్ట్ర అధ్యక్షులు కె విశ్వనాథ్, టి సి కే ఎస్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, ఏఐఎఫ్టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రత్నకుమార్ మాట్లాడుతూ మే 20వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరగబోతున్నది. మోడీ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత కార్మికవర్గం పై దాడిని కొనసాగిస్తున్నది. సింగరేణిలో సైతం కాంటాక్ట్ కార్మికులను కట్టు బానిసలుగా యాజమాన్యం వాడుకుంటుంది వేతనాలు పెంచక వారి శ్రమను దోచుకుంటుంది. లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి పోరాడి సాధించుకున్న హక్కుల సైతం కాలరాస్తున్నది. ఈ స్థితిలో మీ 20వ తేదీ న కార్మికవర్గం కలిసికట్టుగా ఐక్యంగా సమ్మెను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి విరాళం అందజేసిన డిసిసి ఉపాధ్యక్షులు



వలిగొండ మండల రిపోర్టర్ శుభోదయం న్యూస్:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామంలో నూతనంగా నిర్మించే కట్ట మైసమ్మ గుడి నిర్మాణానికి గ్రామ వాస్తవ్యుడు డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి విరాళంగా 60,116/-రూపాయలను కట్ట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సిఎన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహ యాదవ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోలే పాక యాదయ్య మాజీ సర్పంచ్ పోలెపాక సమ్మయ్య మాజీ ఎంపీటీసీ పొలెపాక చంద్రయ్య పొలెపాక యాదయ్య బందరి నరసింహారెడ్డి జక్కిడి శ్రీనివాస్ రెడ్డి బోగారం దాసు ఆవుల స్వామి ఆవులసత్యనారాయణ ఆవుల బిక్షపతి బండ్ల అచ్చయ్య కనుక చారి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీల ఆత్మగౌరవాన్ని భంగపరిచే
## అందాల పోటీలనుప్రతిఘటిద్దాం
## -ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): స్త్రీల ఆత్మ గౌరవాన్ని భంగపరిచే అందాల పోటీలను ప్రతిఘటించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపునిచ్చారు.మంగళవారం ఐద్వా సభ్యత్వ క్యాంపియన్ ను వలిగొండ పట్టణంలోనిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 72 వ మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్ లో గొప్పగా ప్రారంభం చేస్తున్నామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు వందల కోట్ల రూపాయలు ఏరకంగా ఖర్చు చేస్తుందని ప్రశ్నించారు.రాష్ట్రంలో జరుగుతున్న మహిళలపై దాడులు,హత్యల విషయంలో ప్రభుత్వం ఎందుకు సక్రమంగా చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అప్పులు పుడతలేవని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం దుబాయ్ తో పోటీ పడి హైదరాబాద్ లో నిర్వహించడం వల్ల ఏం ఉద్ధరిస్తారని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గత 10 సంవత్సరాల్లో కేసిఆర్ 6లక్షల 71వేల కోట్లు,15 నెలల్లో రేవంత్ రెడ్డి 1లక్ష 50వేల కోట్లు మొత్తం 8 లక్షల 24వేల కోట్లు అప్పు చేశారని రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్ళింది మర్చిపోయారా మిస్ వరల్డ్ పోటీల దీని వెనుక ఉన్న రహస్యం బయట పెట్టాలని డిమాండ్ చేశారు, మహిళలు ఈ పోటీలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు కర్నాటి మత్స్యరాణీ, పట్టణ కార్యదర్శి గర్దాసు నర్మద,సహాయ కార్యదర్శి కూర మంగమ్మ,నాయకులు వేముల లలిత, ఉండ్రాటి నాగలక్ష్మి, సిర్పంగి స్వప్న, ఐలమ్మ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ ఓ సి చెక్కు అందజేత



**వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన వెలిమినేటి శంకరయ్య ఇటీవల పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్ లో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి సహకారంతో 3,00,000/మూడు లక్షల రూపాయలు ఎల్ వో సి చెక్కువారి కుమారుడైన ఎలిమినేటి రాముకు మంగళవారం అందజేయడం జరిగింది.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బండారి నరసింహారెడ్డి మాజీ సర్పంచి పోలేపాక చెమ్మయ్య మాజీ ఎంపిటిసి పోలేపాక చంద్రయ్య ఆవుల సత్యనారాయణ పోలేపాక యాదయ్య విష్ణుమూర్తి ఆవుల అంజయ్య బుర్ర మల్లేశా బత్తిని వెంకటేష్ మర్రి నాగరాజు జనుకల ఉదేష్ వేముల ఎట్టయ్య మీసాల మచ్చ గిరి కసర బోయిన అంజయ్య బైండ్ల అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.**

## కాలుజారి బావిలో పడి బాలుడు మృతి



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో సుధాకర్ చిన్న కుమారుడు చరణ్ వయస్సు 12 సంవత్సరాలు పుట్టుకతోనే చెవిటి మరియు మూగ అని పేర్కొన్నారు.సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అతని కుమారుడు చరణ్, అతని సోదరుడి కుమారుడు బట్టు గౌతమ్,ఇద్దరు కలిసి తుమ్మల బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద స్నానం చేయడానికి వెళ్లారు వారికి ఈత రాకపోవడంతో బావి ఒడ్డున స్నానం చేస్తున్నారు,ఆ సమయంలో అతని కుమారుడు ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మునిగిపోయాడు ఇది చూసి,అతని సోదరుడి కుమారుడు గౌతమ్ ఇంటికి వచ్చాడు కానీ భయం కారణంగా ఎవరికీచెప్పలేదు,సాయంత్రం అతని తల్లి దండ్రులకుపైన విషయం చెప్పాడు, గ్రామస్తులతో కలిసి అక్కడికి వెళ్లి మోటార్ల సహాయంతో నీటిని తొలగిస్తుండగా, మంగళవారం ఉదయం చరణ్ మృతదేహాన్ని కనుగొన్నారు.బట్టు సుధాకర్ ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

## రైతులందరు భూభారతి చట్టంపై
## అవగాహన పెంచుకోవాలి : ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్):భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారమే సదస్సుల ముఖ్య ఉద్దేశంకాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకువచ్చిందిభూభారతి నూతన రెవెన్యూ చట్టం అమల్లో భాగంగా హనుమకొండ జిల్లాలోని నడికూడ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేయగా మంగళవారం మండలంలోని ముస్త్యాల పల్లి మరియు సర్వాపూర్ గ్రామాల్లో జరిగిన సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



గారితో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా భూ భారతి రెవెన్యు సదస్సులో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలను పరిశీలించి, రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.భూ భారతి చట్టం మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతిని తీసుకు వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సీనియర్ అధికారులతో అన్ని రాష్ట్రాల్లో విచారణ చేసి సులువైన పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చామన్నారు. వారికి భూధార్ కార్డును కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.కొత్త చట్టం ప్రకారం కింది స్థాయి అధికారుల వద్ద తప్పు జరిగితే పైస్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం ఉందన్నారు. ఆర్డీఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్ నకు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని అన్నారు.గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా అనేకమంది పేద రైతులు ఇబ్బందులకు గురయ్యారని వేల ఎకరాల భూములు గల్లంతయ్యాయని తెలిపారు.

## ఎంపీడీవో ఆఫీసును సందర్శించిన
## ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి



వలిగొండమండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎన్.శోభారాణి మంగళవారం మండల పరిషత్ కార్యాలయన్ని సందర్శించి మండల స్థాయి అధికారులతో, ఈజీఎస్ సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఆ తర్వాత,నాతాళ్ళగూడ ెంగ్రామపంచాయి ుతీలో,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించి లింటల్ లెవెల్ నిర్మాణం చేసిన జూకంటి మనోహర అనే లబ్ధిదారుని ప్రశంసించారు, బేస్మెంట్ లెవెల్ నిర్మాణం చేయు వారిని త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు.నర్సరీని మరియు సన్న బియ్యం పంపిణీనీ పరిశీలించారు.అక్కంపల్లిలోని ఐకెపి సెంటర్ ను సందర్శించారు.ఈ కార్యక్రమంలోఎంపీడీవో జితేందర్ రెడ్డి,సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పివిరావు మాల మహానాడు
## రాష్ట్ర అధ్యక్షుడిగా సాలె రామారావు



కోదాడ, మే 06, (శుభోదయం న్యూస్): తెలంగాణ పివి రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన సాలే రామారావుని ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగిందని ఇట్టి నియామక పత్రాన్ని పివి రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పందు అశోక్ కుమార్ అందించారని నూతన రాష్ట్ర అధ్యక్షుడు సాలె రామారావు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు పోతుల జ్ఞానయ్య తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు మరియు లక్ష్మల్ల నరసింహా మౌర్య, ఎం. మేఘ రాజు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సాలే రామారావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో మాలలను ఆర్థికంగా రాజకీయంగా చదువు ఉద్యోగ ఉపాధిలో అణగదొక్కే విధంగా రెండు ప్రభుత్వాలు ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణ చేయడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కమిటీలను పూర్తి చేసి ప్రతి గ్రామానికి మాలల యొక్క ఆశయం కోసం స్వర్గీయ పీవీ రావు విధానంలోనే మాలల పక్షాన పని చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

# శ్రమ శక్తి అవార్డు గ్రహీత
# బిల్లా శ్రీకాంత్ సన్మానం



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్):బిల్లా శ్రీకాంత్కు 17 వ డివిజన్ (పూర్వ 4 వ డివిజన్) లోని ఆదర్శ నగర్ (జాన్ పాక్ ) లోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీకాంత్ అభిమానులు, ఆంజనేయ స్వామి మాలదరులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు మరియు వివిధ పార్టీల సీనియర్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వడ్డే రవీందర్ .బిల్లా శ్రీకాంత్ గురించి శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుంది అని కొనియాడారు మాటల్లోబిమంచితనం ,చేతల్లోచురుకుదనంమీకు దేవుడిచ్చిన వరం.శత్రువు సైతం అసూయ పడే మీ సైన్యంఅధినాయకుడి నమ్మకాన్ని వమ్ము చేయని మీ చాతుర్యం ప్రతి క్షణం ప్రజా వీక్షణం అదే మీ విజయ రహస్యం అంటూ కవిత చెప్పిన విధానం అందరినీ ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది.

## ఎల్కతుర్తి జంక్షన్ పనులను పరిశీలించిన.....
## వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్):వరంగల్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైన ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న జంక్షన్ అభివృద్ధి, పనులను త్వరగా సుందరీకరణ పనులైన పౌంటెన్ నిర్మాణం, గ్రీనరీ ఏర్పాటు, శిల్పాలు, విద్యుత్ లైట్లు, సైన్ బోర్డులు, సెంట్రల్ లైటింగ్, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా 'కుడా' పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు ను పనుల పురోగతిని అడిగి తెలుసుకుని పలు పనులపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే మా ధ్యేయం

: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నూజివీడు నియోజకవర్గం, చాట్రాయి మండలం, కృష్ణారావు పాలెం పంచాయితీ సర్పంచ్ చిమట బోయిన పుల్లారావు గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను గురించి వివరించారు. గత గత ప్రభుత్వంలో గ్రామం కుంటి పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత మంత్రి కొలుసు పార్థసారథి ఆశీస్సులతో గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతానికి గ్రామంలో డ్రైనేజీ సమస్య ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పాతాళానికి తొక్కేస్తే, కూటమి ప్రభుత్వం ఆ చీకటి పాతాళం నుండి రాష్ట్రాన్ని వెలుగులోకి తీసుకొచ్చి అభివృద్ధి బాటలో నడిపిస్తుందని తెలిపారు. మరోవైపు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని త్వరలోనే మిగిలి ఉన్న పథకాలు అమలు చేస్తామని చెప్పడం జరిగింది. గత ప్రభుత్వం చేపల చెరువు సమస్యను దూరం పెడితే, ఇప్పుడు ఆ చెరువు సమస్య గురించి సంబంధించిన అధికారులకు తెలియజేయగా త్వరలోనే పరిష్కారం చేస్తామని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అర్హులైనటువంటి ప్రతి ఒక్కరికి కులమత రాజకీయ భేదం లేకుండా అమలు చేస్తున్నామని తెలిపారు గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని సూచించారు.

శుభోదయం! ప్రతి అక్షరం..ప్రజా సమరం......!

## సంపాదకీయం

# ఉమ్మడి చితిపేర్పు

### (విశ్లేషణ)

‘యుద్ధం’ రెండక్షరాల మాటే, ‘శాంతి’ కూడా అంతే! విచిత్రంగా, చావుబతుకులు రెంటినీ ఇముడ్చుకున్నవి కూడా ఆ రెండేబీ జీవన ప్రవాహానికి రెండు వైపులా కాపుకాసే తీరాలూ, మనిషిని ఇరువైపులా మోహరించిన భిన్న ధ్రువాలూ అవేబీ వాటి మధ్యనే మానవ సంచారం.లియో తొలు స్టాయ్ ‘వార్ అండ్ పీస్’ పేరుతో, నిర్దిష్ట స్థలకాలాల నేపథ్యంతో రచించిన ఐతిహాసిక నవలలో మార్చి మార్చి జరిగే ఆ సంచారాన్ని అత్యద్భుతంగా, ఆర్ద్రంగా కళ్ళకు కట్టిస్తాడు.యుద్ధమూ, శాంతీ మనిషితోనే పుట్టి ఉంటాయి. బహుశా మనిషి తొలి యుద్ధం సాటిమనిషితో కాదు, ప్రకృతి శక్తులతో! అది బతకడానికి మొదలైన యుద్ధంబీ మనుషులొకరి నొకరు చంపుకునే యుద్ధం ఆ తర్వాత వచ్చిందిబీ నాగరికత ముదిరినకొద్దీ అది మహాయుద్ధాల స్థాయికి చేరింది.శాంతి అన్నది యుద్ధమనే రెండు క్రూర సింహాల మధ్య ఇరుక్కున్న బెదురుచూపుల లేడికూనా, మండు టెడారిలో అక్కడక్కడ మరులుగొలిపే శీతలజలచ్ఛాయా అయింది. మనిషి ఒంటిగా ఉన్నప్పుడు బతకనిచ్చే, బతుకునిచ్చే శాంతినే కోరుకుంటాడుబీ పదిమందిలో ఒకడైనప్పుడే యుద్ధపిపాసి అవుతాడు. ఈ చంచలత్వం మనిషి స్వభావంలోనే ఉంది.తన శాంతి యుత అస్తిత్వానికే చేటు వచ్చినప్పుడు చావో, రేవో తేల్చుకోవాలనుకోవడం సహేతుకమేబీ కానీ ఏదో ఒక విస్తరణ దాహంతో రక్తపుటేరులు పారించడంలోనే ఎక్కువ చరిత్ర మూటగట్టుకున్నాడు. తన లక్షల సంవత్సరాల మనుగడలో శాంతియుత సహజీవనంపై ఇంతవరకు ఏకీభావానికి రాలేక పోయాడు. అతని అనేకానేక విజయాలను నిలువునా వెక్కిరించే మహా వైఫల్యం అదే. ప్రకృతి ప్రణాళికలో లేని బలవంతపు చావును కొని తెచ్చుకునే వికటించిన తెలివి మనిషిది.ప్రపంచ సాహిత్యంలోని అనేక శిఖరాయమాన రచనల్లో యుద్ధమే ఇతివృత్తం. దేశ కాలాలు, భాషా సంస్కృతులు వేరైనా అవి ఒక్కలానే యుద్ధభాష మాట్లాడాయి, యుద్ధ సంస్కృతిని చిత్రించాయిబీ యుద్ధం తెచ్చిపెట్టే అపార విధ్వంసంపై, సృష్టించే దుఃఖసముద్రాలపై ఒక్క గుండెతోనే స్పందించాయి. యుద్ధాలను గర్హించే పాత్రలకూ, ఆకాశానికెత్తే పాత్రలకూ కూడా ఒకే గౌరవాన్ని కట్టబెట్టాయి. యుద్ధాలు తగవంటూనే పోరాడి ప్రాణాలు బలిపెట్టిన వీరులకు హారతి పట్టాయి.మహాభారతాన్నే తీసుకుంటే, యుద్ధం వద్దన్నవారు కూడా యుద్ధంలోకి దిగిపోయినప్పుడు, విదురుడొక్కడే ఒంటరిగా ఒడ్డున మిగిలిపోతాడు. అంతవరకు కురుపాండవులుభయుల శ్రేయస్సునూ కోరుకున్న భీష్మ పితామహుడు యుద్ధంలో పాండవ పక్షాన్ని నిర్దాక్షిణ్యంగా నరికి పోగులుపెడతాడు. చస్తే యుద్ధంలోనే చావాలి, ఇంట్లో రోగమొచ్చి చావడం కన్నా పాపమేదీ ఉండదని ఉద్బోధిస్తాడు.అర్జునుడు తనను చంపుతానని ప్రతిజ్ఞ చేసినప్పుడు ప్రాణభయంతో వచ్చి తనను కలిసిన సైంధ వునితో ఆచార్య ద్రోణుడూ అదే అంటాడుబీ ‘మృత్యువుకెందుకు భయపడుతున్నావు, వెళ్ళి యుద్ధం చేయి, ఎవరూ భూమ్మీద శాశ్వతం కాదు, అందరూ పోయేవాళ్ళే’ నంటాడు. ‘వార్ అండ్ పీస్’లో మరియా దిమిత్రెవ్నా అనే పాత్ర, తన కొడుకులు నలుగురు సైన్యంలో ఉన్నారనీ, అయినా తనకు చింత లేదనీ, చావనేది ఇంట్లో పడుకుని ఉన్నా వస్తుందనీ సగర్వంగా అంటుంది.యుద్ధానికి ఎందుకు సిద్ధమవుతున్నావని పియర్ అనే పాత్ర తన మిత్రుడు ప్రిన్స్ ఆంద్రైని అడిగినప్పుడు, ‘ఏమో, ఎందుకో నాకే తెలియదు, ఇప్పుడు జీవిస్తున్న జీవితం నాకు నచ్చడంలే’దని అతనంటాడు. హోమర్ కృతి ‘ఇలియడ్’లో ట్రాయ్ రాకుమారుడు హెక్టర్, అర్జునుడిలానే యుద్ధాన్ని ద్వేషిస్తాడు, తన భార్య శత్రువుకి బానిసగా చిక్కి ఊడిగం చేసే దృశ్యాన్ని ఊహించుకుని కుంగిపోతాడు, అయినా సరే యుద్ధం చేసి అఖిలీస్ చేతిలో మరణిస్తాడు. అఖిలీస్ చంపడంలోనే వెర్రి ఆనందాన్ని అనుభ విస్తాడు, అదే ఉత్తమోత్తమ పుణ్యకార్యమనుకుంటాడు, ఆ రోజుకి యుద్ధమైపోయాక మళ్ళీ మనిషై పోతాడు. తను రథానికి కట్టి ఈడ్చుకొచ్చిన హెక్టర్ మృతదేహాన్ని యాచించడానికి అతని తండ్రి ప్రియామ్ వచ్చినప్పుడు, అతణ్ణి సగౌరవంగా ఆహ్వానించి శవాన్ని అప్పగించి పంపిస్తాడు. యుద్ధవ్యతిరేకతా, యుద్ధప్రియత్వాల మధ్యబీ మానుష, అమానుషత్వాల మధ్య మనిషి ఊగిస లాట ఆశ్చర్యం గొలుపుతుందిబీ క్షతగాత్రుడై పడున్న శత్రువీరుడు ఆంద్రైని చూసి నెపోలియన్ గుండె కరుగుతుంది. తన చేతిలో మరణించిన వాలిపై పడి తారా, రావణునిపై పడి మండోదరీ హృదయ విదారకంగా రోదిస్తున్నప్పుడు రాముడు మ్రాన్పడి ఉండిపోతాడు. ఏ యుద్ధంలోనైనా విజేతలు, పరాజితులన్న తేడా కేవలం సాంకేతికమేబీ అంతిమ విజయం మృత్యు, విధ్వంసాలదే! విజేత పక్షానికి చెందిన గర్భవతి ఉత్తర, భర్త అభిమన్యుని మరణానికి కన్నీరుమున్నీరవుతుంది. ఉప పాండవులను పోగొట్టుకున్న ద్రౌపది కడుపుకోతా, నూరుగురు కొడుకులను కోల్పోయిన గాంధారి గర్భశోకమూ ఒక్కటే అవుతాయి. నివాసాలు శ్మశానాలవుతాయి, ఊళ్ళు కాలిబూడిదవుతాయి,కొంపలు కొల్లేరవుతాయి, ఖజానాలు ఖాళీ అవుతాయి, శవాల గుట్టల మధ్య బతికున్నవాళ్లు జీవచ్ఛవాలవుతారు. గాంధారి శోకం శాపమై యదువంశాన్ని పట్టి కుదుపుతుంది, యుద్ధం ఇంకో యుద్ధానికే బీజావాపమవుతుంది, విధ్వంసం మరో విధ్వంసానికే దారి తీయిస్తుంది. శాంతి, రెండు యుద్ధాల మధ్య విరామ చిహ్నామవుతుంది. ఎంతో ఎదిగామనుకునే ఈ రోజున కూడా యుద్ధానికీ, శాంతికీ మధ్య ద్వైదీభావాన్ని మనిషి జయించలేకపోతున్నాడుబీ ఉండి ఉండి యుద్ధోన్మాది అవుతూనే ఉన్నాడు, భేరీలు మోగిస్తున్నాడు, నినాదాలు ఎలుగెత్తుతున్నాడు! ఇందుకు ఏ ఒక్కరో బాధ్యులు కారు, ఇది సమష్టి వైఫల్యం, ఉమ్మడి చితిపేర్పు.

# ఏ క్షణమైనా పాక్‌పై దాడులు..
# ప్రధాని మోదీతో ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ అత్యవసర భేటీ..

9, 10,11. ఈ తేదీల్లో పాకిస్తాన్ మీద భారత్ దాడులు చేస్తుందా? పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పేందుకు భారత్ రంగం సిద్ధం చేస్తోందా?.. ఏ విధంగా చర్యలు ఉండబోతున్నాయ్.. అనేది ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలో ఢిల్లీలో వరుసగా సాగుతున్న మీటింగ్‌లు- అంచనాలు మరింత పెంచేస్తున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ప్రధాని మోదీ.. వరుసగా ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు.. ఈ క్రమంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మంగళవారం న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలిశారు. ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్.. దేశ భద్రత స్థితిగతులపై మోదీకి బ్రీఫింగ్ ఇచ్చారు. అయితే.. 48 గంటల్లో మోదీ-దోవల్ భేటీ కావడం ఇది రెండోసారి.. అయితే.. రేపు దేశవ్యాప్త మాక్‌డ్రిల్‌కి ముందు వీరిద్దరి సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. నిన్న రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ప్రధానమంత్రిని కలిశారు. అంతకుముందు, వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కూడా మోదీతో సమావేశం నిర్వహించారు. నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిలతో విడివిడిగా సమావేశాలు జరిగాయి. పహల్గామ్ ఉగ్రదాడులకు పాల్పడినవారిని, వారికి మద్దతిచ్చేవారిని ఊహకందని రీతిలో శిక్షిస్తామని ప్రకటించిన ప్రధాని అందుకు అనుగుణంగా వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. దేశ భద్రతపై ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం 26 మంది మరణించారు. తర్వాతిరోజు, అంటే ఏప్రిల్ 23నాడు సౌదీ టూర్‌ను మధ్యలోనే ముగించుకుని, ఢిల్లీకి వచ్చిన మోదీ, అదేరోజున అజిత్ దోవల్‌ను పిలిపించుకుని మాట్లాడారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో మోదీ-దోవల్ భేటీలు జరిగాయి. ఈ నేపథ్యంలో రేపటి దేశవ్యాప్త మాక్‌డ్రిల్ తర్వాత ఏం జరుగుతోందన్నదే ఆసక్తిగా మారింది.



పహల్గామ్ దాడికి భారతదేశం ప్రతీకారం తీర్చుకునే సమయం, విధానం, స్వభావాన్ని నిర్ణయించుకోవడానికి సైన్యానికి ‘పూర్తి కార్యాచరణ స్వేచ్ఛ’ను మోదీ ఇటీవల ఇగట్టి దెబ్బ’ ఇవ్వాలనే దేశం దృఢ సంకల్పాన్ని ఆయనచ్చారు. ‘ఉగ్రవాదానికి నొక్కి చెప్పారు. సైనిక సంసిద్ధతతో పాటు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పౌర సంసిద్ధతను పెంచుతోంది. మే 7, బుధవారం, అన్ని రాష్ట్రాలుచ, కేంద్రపాలిత ప్రాంతాలు 244 పౌర రక్షణ జిల్లాలను కలుపుకుని విస్తృతమైన మాక్ డ్రిల్‌లను నిర్వహిస్తాయి. ఈ కసరత్తులలో వైమానిక దాడి సైరన్‌లను మోగించడం, డ్రిల్‌గా ప్రజలను తరలించడం, భారత వైమానిక దళంతో కమ్యూనికేషన్ సంబంధాలను పరీక్షించడం, నియంత్రణ గదులను సమీకరించడం వంటివి ఉంటాయి.

# సాంకేతికతతో యుద్ధానికి సై



సాంకేతిక పరిజ్ఞానం అన్ని రంగాల్లో వేగంగా విస్తరిస్తోంది. అందుకు యుద్ధ భూమి ఏమీ అతీతం కాదు. శత్రువులపై యుద్ధం సాధించేందుకు, స్పష్టమైన ఫలితాల కోసం టెక్నాలజీ వాడుతున్నారు. ఇందులో భాగంగా మానవరహిత ఆయుధాలు, సైబర్ వార్ఫేర్, డ్రోన్లు, రోబోటిక్స్, అన్ మ్యాన్డ్ అడ్వాన్స్‌డ్ వెపన్స్.. వంటి చాలా పరికరాల్లో సాంకేతికతను వినియోగిస్తున్నారు. కృత్రిమమేధ వాడకం పెరుగుతున్న ఈ రోజుల్లో రణరంగంలో టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగిస్తున్నారో తెలుసుకుందాం.

ఏఐ, మెషిన్ లెర్నింగ్

యుద్ధ సమయాల్లో నిర్ణయాలు తీసుకోవడం, ప్రక్రియలను ఆటోమేట్ చేయడం, ఇంటెలిజెన్స్ విశ్లేషణను మెరుగుపరిచేందుకు కృత్రిమ మేధ సాయం తీసుకుంటున్నారు. యుద్ధరంగంలో ఇది విప్లవాత్మక మార్పులు తెస్తోంది. శత్రువుల కదలికలను అంచనా వేయడానికి లేదా వ్యూహాత్మక లక్ష్యాలను గుర్తించడానికి ఏఐ విస్తారమైన డేటాసెట్లను ప్రాసెస్ చేస్తుంది. అటానమస్ విధానం ద్వారా డ్రోన్లు, వాహనాలకు ఏఐ సామర్థ్యాలు జోడిస్తున్నారు. ఇది మానవ ప్రమేయం లేకుండా రియల్ టైమ్ డెసిషన్ మేకింగ్‌కు వీలు కల్పిస్తుంది. సైబర్ బెదిరింపులను గుర్తించి సమర్థంగా కట్టడి చేసేందుకు మెషిన్ లెర్నింగ్ తోడ్పడుతుంది. కీలకమైన మౌలిక సదుపాయాలను రక్షిస్తుంది.

మానవ రహిత వ్యవస్థలు (డ్రోన్లు, రోబోటిక్స్)

యుద్ధంలో మానవరహిత వ్యవస్థలు అనివార్యంగా పెరుగుతున్నాయి. ఇది సైనికులు ప్రాణాలు కోల్పోవడాన్ని తగ్గిస్తుంది. ఇందులో డ్రోన్లు కీలకంగా మారుతున్నాయి.

ఏరియల్ డ్రోన్లను నిఘా, దాడుల్లో కచ్చితత్వం కోసం ఉపయోగిస్తున్నారు. అమెరికా ఆర్మీకి చెందిన స్మాల్ అన్‌మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్ (ఎస్‌యూజీవీ) వంటి రోబోలు బాంబుల తొలగింపును నిర్వహిస్తున్నాయి. మానవరహిత అండర్ వాటర్ వెహికల్స్ (యూయూవీ) మైన్ డిటెక్షన్, సబ్ మెరైన్ ట్రాకింగ్ పనులు చేస్తున్నాయి.

సైబర్ వార్‌ఫేర్ టెక్నాలజీ

యుద్ధ సమయంలో కమ్యూనికేషన్లు, ఆర్థిక వ్యవస్థలు, ఇతర రక్షణ వ్యవస్థలకు అంతరాయం కలిగించేలా సైబర్ దాడులు నిర్వహించే అవకాశం ఉంది. వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సైబర్ వార్‌పేర్ డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. ఇందులో భాగంగా మాల్వేర్, హ్యాకింగ్ టూల్స్ ద్వారా ప్రభుత్వ ప్రాయోజిత వెబ్‌సైట్‌ల్లోని సమాచారం శత్రు దేశాల్లోని నెట్‌వర్క్‌లోకి వెళ్లకుండా అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. దాంతోపాటు ఏఐ ఆధారిత సైబర్ సెక్యూరిటీ ద్వారా మిలిటరీ నెట్‌వర్క్‌లను రక్షిస్తున్నారు.

అధునాతన ఆయుధాలు

ఆధునిక ఆయుధాల ద్వారా ప్రమాద పరిధి పెరుగుతుంది. రష్యాకు చెందిన కింజాల్ అనే హైపర్ సోనిక్ ఆయుధాలు లేదా చైనాకు చెందిన డీఎఫ్-జెడ్ ఎఫ్ వంటి క్షిపణులు సంప్రదాయ రక్షణ వ్యవస్థల నుంచి వెంటనే తప్పించుకుంటాయి. లేజర్లు, మైక్రోవేవ్ వ్యవస్థలు డ్రోన్లు లేదా క్షిపణులను కచ్చితత్వంతో నిలిపివేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. జీపీఎస్ గైడెడ్ బాంబులు నిర్దిష్ట లక్ష్యాన్ని చేదిస్తాయి.

**శాటిలైట్ అండ్ స్పేస్ టెక్నాలజీస్**

సైనిక కార్యకలాపాలకు అంతరిక్షం కీలకమైన డొమైన్‌గా మారింది. నిఘా ఉపగ్రహాలతో రియల్ టైమ్ ఇమేజ్‌లు, ప్రత్యేకంగా సిగ్నలింగ్ సదుపాయాలను పొందుతున్నారు. దళాల కదలికల కోసం జీపీఎస్, నావిగేషన్‌ను వాడుతున్నారు. కమ్యూనికేషన్లకు అంతరాయం కలిగించే శత్రు ఉపగ్రహాలను నిలిపివేయడానికి లేదా నాశనం చేయడానికి యాంటీ శాటిలైట్ వెపన్స్ రూపొందిస్తున్నారు.

# ఈ ఏడాదిలో ఆర్‌బీఐ మరోసారి తీపికబురు

## 2025-26లో వడ్డీ రేట్లు తగ్గొచ్చు..
## ఎస్‌బీఐ అధ్యయనం అంచనా




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ మొత్తం మీద 125 బేసిస్ పాయింట్ల మేర (1.25-1.5 శాతం) రేట్లను తగ్గించొచ్చని ఎస్‌బీఐ అధ్యయన నివేదిక అంచనా వేసింది. దీంతో మొత్తం మీద రేట్ల తగ్గింపు 150 బేసిస్ పాయింట్లుగా ఉంటుందని పేర్కొంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఈ అంచనాలకు వచ్చింది. 0.25 శాతం స్థానంలో 0.50 శాతం చొప్పున జంబో రేటు తగ్గింపు చేపడితే అది మరింత ప్రభావవంతంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం మార్చి నెలలో 3.34 శాతానికి పరిమితం కావడం తెలిసిందే. ఇది 67 నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఆహార ద్రవ్యోల్బణం శాంతించడంతో 2025-26 సంవత్సరంలో సగటు సీపీఐ ద్రవ్యోల్బణం 4 శాతం లోపు ఉంటుందని ఈ నివేదిక తెలిపింది. మరీ ముఖ్యంగా ప్రస్తుత త్రైమాసికంలో ఇది 3 శాతంలోపునకు దిగివస్తుందని పేర్కొంది. నామినల్ జీడీపీ (ద్రవ్యోల్బణం మినహాయించని) 9-9.5 శాతం స్థాయిలో 2025-26 సంవత్సరానికి ఉంటుందని (బడ్జెట్ అంచనా 10 శాతం) అంచనా వేసింది. తక్కువ వృద్ధి రేటు, కనిష్ట ద్రవ్యోల్బణం నేపథ్యంలో రేట్ల తగ్గింపునకు అనుకూల తరుణంగా వివరించింది. ఎస్‌బీఐ ఆర్థిక పరిశోధన విభాగం ఈ నివేదికను రూపొందించింది.



ఆగస్ట్ నాటికి 0.75 శాతం..

‘మార్చిలో కనిష్ట స్థాయికి ద్రవ్యోల్బణం దిగిరావడం.. రానున్న కాలంలోనూ పరిమిత స్థాయిలోనే ఉంటుందన్న అంచనాలతో వచ్చే జూన్, ఆగస్ట్ పాలసీ సమీక్షల్లో ఆర్‌బీఐ 75 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గించొచ్చు. తిరిగి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల్లో మరో 50 బేసిస్ పాయింట్ల రేట్లను చేపట్టొచ్చు. దీంతో మొత్తం మీద 125 బేసిస్ పాయింట్ల తగ్గింపునకు అవకాశం ఉంది. ఇప్పటికే ఫిబ్రవరి సమీక్షలో 25 బేసిస్ పాయింట్లను తగ్గించడం జరిగింది’ అని ఈ నివేదిక వెల్లడించింది. కాకపోతే ఒకేసారి 25 బేసిస్ పాయింట్లకు బదులు 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపును చేపట్టడం వల్ల ఎక్కువ ఫలితం ఉంటుందని భావిస్తున్నట్టు వివరించింది. ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నియంత్రిత స్థాయి అయిన 2-6 శాతం పరిధిలోనే ఉండడాన్ని గుర్తు చేసింది. ఆర్‌బీఐ ఇప్పటికే రెండు విడతల్లో 50 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా, రెపో అనుసంధానిత రుణాలపై ఈ మేరకు ప్రయోజనాన్ని బ్యాంకులు బదిలీ చేసినట్టు తెలిపింది. ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాలపై రేటు తగ్గింపు ఇంకా ప్రతిఫలించాల్సి ఉందని పేర్కొంది.

## కుల గణనపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలి



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కులగణన జరపడానికి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోడీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం (మే 5) మోడీకి లేఖ రాశారు. దేశంలో మొట్టమొదటిసారిగా కులగణను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ తెలంగాణ కులగణన నమూనాను అనుసరించాలని ఖర్గే లేఖలో మోడీ ప్రభుత్వాన్ని కోరారు. తుది కుల గణన నివేదికలో ఏదీ దాచిపెట్టవద్దని.. ప్రతి కులం యొక్క సామాజిక, ఆర్థిక డేటాను ప్రజలకు చేరువలో ఉంచాలి అని ఆయన మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రిజర్వేషన్లకు సంబంధించిన విషయంపై కూడా ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఆగస్టు 1994 నుండి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో తమిళనాడు రిజర్వేషన్ల చట్టం మాత్రమే రక్షించబడింది. అదే మాదిరిగా.. ఇతర రాష్ట్రాల చట్టాలను కూడా మన రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలి అని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని కూడా రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించేందుకు కులగణన సర్వే ద్వారా స్పష్టమవుతుందని ఆయన లేఖలో తెలిపారు. ఈ కులగణన సర్వే ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించే ఆర్టికల్ 15(5)ను అమలు చేయాల్సిన అవసరం నెలకొంటుంది అని ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఉన్నత విద్యా శాఖకు గ్రాంట్ల డిమాండ్లపై మార్చి 25, 2025న సమర్పించిన 364వ నివేదికలో విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆర్టికల్ 15(5)ని అమలు చేయడానికి కొత్త చట్టాన్ని సిఫార్సు చేసిందని ఖర్గే పేర్కొన్నారు. సామాజిక న్యాయం అనే అంశాన్ని లేవనెత్తినందుకు ప్రధాని మోడీ, ఆయన సహచరులు కాంగ్రెస్‌పై దాడి చేశారు. అయినప్పటికీ మన రాజ్యాంగ ప్రవేశికలో ప్రతిజ్ఞ చేసినట్లుగా ఆర్థిక న్యాయం, హోదా, అవకాశాల సమానత్వాన్ని నిర్ధారించడానికి కులగణన ఖచ్చితంగా అవసరం అని ఖర్గే నొక్కి చెప్పారు. మన సమాజంలో వెనుకబడిన అణగారిన వర్గాలకు వారి హక్కులను అందించే కులగణన వంటి ప్రక్రియను నిర్వహించడం ఏవిధంగానూ విభజనగా పరిగణించకూడదు అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు.

## ‘నీ ఆదాయం పెరిగింది.. తెలంగాణ ఆదాయం ఎందుకు పెరగలేదు’



**హైదరాబాద్, :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందాల పోటీలకు రూ.250 కోట్లు పెట్టడానికి డబ్బులు ఉన్నాయి కానీ.. రిటైర్ అయిన ఉద్యోగులకు ఇవ్వడానికి డబ్బులు లేవా? అని మండిపడ్డారు. నిన్ను కోసుకొని తినడం కాదు.. నువ్వే రాష్ట్రాన్ని పీక్కొని తింటున్నావ్ సర్కార్ నడుపుతున్నావా? సర్కస్ నడుపుతున్నావా? అంటూ రేవంత్ రెడ్డిపై ఫైరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అసలు, వడ్డీ కలిపి నెలకు చెల్లించే అప్పు కేవలం రూ.2000 కోట్లు మాత్రమేనని, ఇది కాగ్ లెక్క..మీ లాగా కాకి లెక్క కాదన్నారు. చెప్పులు ఎత్తుకపోవడానికి వేరే పార్టీ వాళ్ళు రెడీగా ఉన్నారని.. ఢిల్లీకి మూటలు మోయడానికి పోతే దొంగ లెక్కనే చూస్తారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి స్పెషల్ ఫ్లైట్స్, లగ్జరీ ప్రయాణాలు అన్ని ప్రజలు చూస్తున్నారని.. ఎకానమీ క్లాస్‌లో ప్రయాణం చేస్తున్నానని సిఎం అంటున్నారని, దమ్ముంటే 43 సార్లు వెళ్లిన ఢిల్లీ ప్రయాణాల ఖర్చు మీద శ్వేతపత్రం విడుదల చెయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. “ఫోర్త్ సిటీలో 2000 ఎకరాలు ఎట్లా కొన్నావు?. నీ అన్నదమ్ములు, నీ బామ్మర్ది, నీ కుటుంబ సభ్యులు అందరి ఆదాయం పెంచుకున్నావు. కానీ రాష్ట్ర ఆదాయం ఎందుకు పెరగలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి లీటర్ రూ.200 చేసి సంపద పెంచాలని అనుకుంటున్నాడు, ధరలు పెంచడం కాదు.. బుర్ర పెంచు.. సంపద పెంచే ఆలోచన చేయి” అని సిఎం రేవంత్ పై కెటిఆర్ ధ్వజమెత్తారు.

## సోలార్ విద్యుత్ మాకు కుదించకండి.. కేంద్రమంత్రితో భట్టి



ఢిల్లీ : కేంద్రమంత్రి ప్రహ్లాద జోషితో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బేటీ అయ్యారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి గురించి వారిద్దరు చర్చించారు. తెలంగాణలో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను ఇప్పటికే చేపట్టింది. ముఖ్యంగా, మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా రాష్ట్రం పెట్టుకుంది. సోలార్ పవర్ విషయంలో కేంద్ర ?ప్రభుత్వం కూడా నూతన పాలసీ తీసుకురావడంతో దానిపై తెలంగాణ ప్రత్యేక దృష్టి సారించింది. రైతుల ద్వారా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి సాధించేందుకు గాను వారికి పెద్ద ఎత్తున సోలార్ పంపులను పెట్టించాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు భట్టి మిక్రమార్క చెప్పారు. అయితే, కేంద్రం 4 వేల మెగావాట్ల నుంచి వెయ్యి మెగావాట్ల వరకు కుదించినట్లు తమకు సమాచారం అందిందని చెప్పారు. ఈ విషయంపైనే కేంద్రమంత్రి ప్రహ్లాద జోషితో చర్చించినట్లు భట్టి తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ముందుగా ప్రకటించిన 4 వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందం కొనసాగేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటికే మహిళా స్వయం సహాయక బృందాలతో 1000 మెగా వాట్ల విద్యుత్ కోసం ఎమ్ఓయూ ద్వారా ఒప్పందం చేసుకున్నామని ఆయన గుర్తుచేశారు.

## టీటీడీ ట్రస్ట్ బోర్డ్-అత్యవసర-భేటీ



**అమరావతి,:** ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సోమవారం నాడు 65,095 మంది భక్తులు శ్రీవారి దర్శించుకున్నారు. వారిలో 26,912 మంది తలనీలాలు సమర్పించారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ఒక్కరోజే హుండీ ద్వారా 3.78 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏడు కంపార్ట్‌మెంట్లల్లో భక్తులు వేచివున్నారు. టోకెన్ లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి 6 నుంచి 8 గంటల సమయం పట్టింది. కంపార్ట్‌మెంట్లు, క్యూ లైన్లల్లో ఉన్న వారికి టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు అల్పాహారం, పాలు, మంచినీరు పంపిణీ చేశారు. కాగా- టీటీడీ పాలక మండలి అత్యవసరంగా సమావేశం కాబోతోంది. బుధవారం ఉదయం 11 గంటలకు భేటీ కానుంది. తిరుమలలోని అన్నమయ్య భవన్ పాలక మండలి కార్యాలయం దీనికి వేదిక. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దీనికి అధ్యక్షత వహించనున్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్ దీనికి హాజరు కానున్నారు. టీటీడీ కార్యనిర్వహణాధికారి జే శ్యామలరావు, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, జేఈఓ వీరబ్రహ్మం పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పాలక మండలి పలు నిర్ణయాలను తీసుకోనున్నట్లు తెలుస్తోంది. తిరుమలలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించడం, శ్రీవారి లడ్డూ, అన్నప్రసాదంలో నాణ్యతపై సమీక్షించనుంది. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఫీడ్ బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్‌ను ఇటీవలే ప్రవేశపెట్టింది టీటీడీ. దీనిపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంది. అలాగే- టీటీడీ ఆలయాలు, ఆస్తుల గ్లోబల్ ఎక్స్‌పాన్షన్ కోసం అవసరమైన సూచనల కోసం నిపుణులతో కమిటీ ఏర్పాటుకు గత పాలక మండలి ఆమోదం తెలిపింది. ఈ కమిటీ ఇచ్చే రిపోర్టుపై తాజా సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం. దేశంలోని ప్రముఖ ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాలు నిర్మించేందుకు కమిటీ ఏర్పాటుపై చర్చిస్తుంది. కాలినడకదారుల్లో తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించడానికి అవసరమైన సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది నియామకంపై తుది నిర్ణయం తీసుకోవచ్చు.

# కుక్కకాటుకు ‘చావు’ దెబ్బ!



రాష్ట్రంలో వీధికుక్కల బెడద పెరుగుతున్నది. ఏ మూలనుంచి ఏ కుక్క వచ్చి దాడిచేస్తుందో తెలియని దుస్థితి నెలకొన్నది. చిన్నారులు ఇంటిముందు ఆడుకుంటున్నా తల్లిదండ్రులు వారిని ఒంటరిగా వదల్లేని పరిస్థితి ఉన్నది. హైదరాబాద్ మహానగరంలోనైతే ఈ సమస్య మరింత జఠిలంగా మారింది. పౌరుల రక్షణకు చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం శూన్యంగానే కనిపిస్తున్నది. ఎందుకంటే ఈ నాలుగు నెలల్లోనే పదివేల మందికి పైగా కుక్కకాటుకు గురై బాధితులు చికిత్స తీసుకుంటున్నట్టు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) లెక్కల్ని చూస్తే అర్థమవుతున్నది. సాధారణంగా నారాయణగూడలోని ఐపీఎంకు నెలకు రెండు వేల నుంచి రెండువేల ఐదువందల మధ్య ఓపి ఉంటుంది. కానీ ఏప్రిల్, మే నెలల్లో అది కాస్తా మూడు వేలకు చేరువ కావడం ఆందోళన కలిగిస్తున్నది. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలతో నీరు దొరక్క పోవడం, రహదారులపై వేసే చెత్త, దుర్గంధంతో కుక్కలు అక్కడే గుమిగూడటం, ఆహారం దొరక్క ఆగ్రహంతో అటువైపుగా వెళ్లేవారిపై దాడిచేసి గాయపరచడం తరచూ జరుగుతున్నవి. ఇది జీహెచ్ఎంసీ నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నది. ఇటీవల వెల్లడయిన ఒక సర్వే ప్రకారం చూస్తే ప్రపంచవ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో ముప్పై ఆరుశాతం మనదేశం నుంచే ఉండటం ఆందోళన కలిగించే అంశం. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్నాటక తర్వాత తెలంగాణలోనే ఈ కేసులు నమోదవుతున్నట్టు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సమాచారం. యాంటి రేబిస్ టీకాలు పీహెచ్‌సీలతో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాల్సి ఉన్నప్పటికీ ఎక్కడ కూడా దీనిపై ఒక స్పష్టత లేదు. రేబిస్ నిరోధక టీకాల కొనుగోలు, సరఫరా అంతా ఒక మిథ్యగానే ఉంది. కోట్లాది రూపాయలు వ్యయం చేసి కొంటున్నామని చెబుతున్నప్పటికీ మందులు మాత్రం అందుబాటులో లేవన్నది సత్యం! ఎందుకంటే, అధికారిక లెక్కల ప్రకారమే కుక్కకాటుతో దాదాపు యేటా యాభైవేల మంది ఆస్పత్రుల పాలవుతున్నారంటే టీకాల కొరత దానికి సాక్ష్యం. యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్-2001 ప్రకారం వీధి కుక్కల జనాభాను తగ్గించడానికి వాటికి స్టెరిలైజేషన్ టీకాలు వేయాలి.కానీ వీటి నియంత్రణకు నిధుల కొరత చాలా రాష్ట్రాలను వెంటాడుతున్నది. కేంద్రమైనా పట్టించుకుంటుందంటే అదీ లేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3.8లక్షల శునకాలున్నట్టు 2023లో హైకోర్టుకు ఇచ్చిన గణాంకాల్ని బట్టి తెలుస్తున్నది.7.21లక్షల కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించినట్టు కార్పొరేషన్ తెలిపింది. మేయర్ మాత్రం 5.75లక్షల కుక్కల్ని గుర్తించినట్టు పేర్కొంది. పొంతన లేని సమాధానాలే అనేక ప్రశ్నలకు ఆస్కారమిస్తున్నాయి. వాస్తవానికి దీనికి రెట్టింపు కుక్కలు నగరవాసుల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి! సుమారు వందమంది నిత్యం ఏదో ఓచోట ఈ కుక్కల బారిన పడి గాయాలపాలు కావాల్సి వస్తున్నది. రెండేండ్ల కిందట అంబర్‌పేటలో జరిగిన కుక్కల దాడిలో నాలుగేండ్ల చిన్నారి మృతి ఘటనను సుమోటాగా తీసుకున్న హైకోర్టు కుక్కల జనాభా నియంత్రణ, పౌరుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని జీహెచ్ఎంసీని ఆదేశించింది. అప్పటికి దీనిపై ఒక ప్రణాళిక గానీ, ముందస్తు కసరత్తు లాంటివి అధికార యంత్రాంగం చేయలేదు. దీంతో నెలల వ్యవధిలోనే మరో ఎనిమిది ఘటనలు చోటుచేసుకున్నాయి. మళ్లీ హైకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప సర్కార్‌లో కదలిక రాలేదు. ‘రాష్ట్రంలో వీధికుక్కల బెడదను నిర్మూలిస్తామని, చిన్నారుల మరణాలు మరెక్కడా సంభవించకుండా చర్యలు తీసుకుంటామని’ ముఖ్యమంత్రి చెప్పారు. కానీ, ఈ రెండేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా పదిహేను నుంచి ఇరవైమంది చిన్నారులు కుక్కలదాడిలో బలయ్యారు? వరుస ఘటనల నేపథ్యంలో ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆక్రోశంతో బ్లూక్రాస్ అనే సంస్థతో ఒప్పందం చేసుకున్న జీహెచ్ఎంసీ కొన్నిరోజులు హడావిడి చేసింది. కానీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. భారత జంతు సంక్షేమ బోర్డు నియమాల ప్రకారం జంతువులకు స్టెరిలైజేషన్ చేసి, యాంటీ-రేబిస్ టీకాలు వేసి, కోలుకున్న తర్వాత, వాటిని పట్టుకున్న అదే ప్రాంతంలో వదిలేయాలి. కానీ ఆదిశగా అడుగులు వేయడంలో సర్కారు నిర్లక్ష్యం కనిపిస్తున్నది. గ్రామాల్లోనూ కుక్కల స్వైర విహారానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. గొర్రెల మందలపై విచ్చలవిడిగా దాడులు చేయడంతో పలుచోట్ల మృత్యువాత పడుతూ కాపరులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నవి. ఇప్పటికైనా ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి వీధికుక్కల బెడదను తగ్గించేందుకు కారణాల్ని విశ్లేషించాలి. చిన్నారుల మరణాలను అరికట్టాలి. లేదంటే ‘కుక్కకాటుకు చెప్పుదెబ్బ’ అన్న నానుడి సర్కార్‌కు కూడా వర్తిస్తుంది.

# అస్పష్ట అమరావతి




విభజనకు గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదకొండేళ్ల తర్వాత కూడా రాజధాని రూపు రేఖలపై అస్పష్టత వీడకపోవడం ఏలికలు సృష్టించిన ఉత్పాతం.టిడిపి కూటమి ప్రభుత్వం శుక్రవారం పెద్ద హైప్ ఇచ్చి ప్రధాని మోడీతో రాజధాని అమరావతి పున:ప్రారంభ మహోత్సవం నిర్వహించాక కూడా అయోమయం అలాగే ఉంది. రూ.49 వేల కోట్ల విలువైన అమరావతి పునర్నిర్మాణ 74 ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపనలు చేశారు. రాజధాని నిర్మాణం స్వాగతించదగినది. ప్రధాని అమరావతికి ప్రాణప్రతిష్ట చేస్తున్నారంటే ఎంత ఆర్థిక సాయం చేస్తారన్న ఉత్సుకత ప్రజల్లో ఉంటుంది. కానీ ప్రధాని మాటలతో సరి పెట్టి అందరినీ తీవ్ర నిరాశకు గురి చేశారు. 2015 అక్టోబర్ 22 దసరా రోజున అమరావతికి తొలుత శంకుస్థాపన చేసిన మోడీ గుప్పెడు మట్టి చెంబుడు నీళ్లు తెచ్చి అదే కొండంత సాయమనుకోమన్నారు. దశాబ్దం గ్యాప్ తీసుకొని ఒట్టి మాటలు వల్లించడం మ్మోడీకే చెల్లింది. అప్పుడు ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మోడీ సాయానికి ఉబ్బితబ్బివ్వడం రాష్ట్ర ప్రజలకు ఎదురైన ఒకానొక విచిత్ర అనుభవం! పదేళ్లుగా అమరావతికి నిరంతరయంగా తాము సాయం చేస్తూనే ఉన్నామని పున:ప్రారంభ వేదికపై ప్రధాని అవాస్తవం చెప్పారు. అంతగా నిధులిస్తే ఎందుకు రాజధాని పూర్తి కాలేదన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. నాడు చంద్రబాబు ప్రతిపాదిత బాహుబలి అమరావతి నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లవుతుందని అంచనాలు కట్టగా కేంద్రం తొలినాళ్లలో విదిల్చిన 1,500 కోట్లే మినహా రూపాయి రాలేదు. స్విట్జర్లాండ్, ప్రపంచబ్యాంక్ పేరిట హడావుడే తప్ప తొలి ఐదేళ్లల్లో టిడిపి సర్కారు తాత్కాలిక భవనాలకే పరిమితమైంది. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల ఆట తెరమీదకి తేగా ప్రధానిగా ఉన్న మోడీ వారించలేదు సరికదా, రాజధానిరాష్ట్ర ప్రభుత్వం ఇష్టమని ఉన్నత న్యాయస్థానాల్లో కేంద్రం అఫిడవిట్‌లు ఇచ్చింది. అమరావతి పున:ప్రారంభ సభలోనూ జగన్‌ను మోడీ ఏమీ అనలేదు. వైసిపి సైతం ప్రధాని రాష్ట్రానికి ఏమీ చెయ్యకపోయినా, అమరావతికి నయాపైసా ప్రకటించకపోయినా నోరు మెదపలేదు. దీన్నిబట్టే కేంద్ర బిజెపికి, జగన్‌కు మధ్య సంబంధ బాంధవ్యాలేమిటో తెలిసిపోతుంది. అమరావతి ‘2.0’ సాకారం కావాలంటే 77 వేల కోట్లు కావాలని టిడిపి కూటమి ప్రభుత్వం ఎస్టిమేట్ వేసింది. వాటిలో కేంద్రం మధ్యవర్తిగా ప్రపంచ బ్యాంక్ నుంచి ఇప్పించే అప్పు 15 వేల కోట్లు కాగా హడ్కో రుణం 11 వేల కోట్లు, జర్మనీ బ్యాంక్ కెఎఫ్‌డబ్ల్యు లోన్ ఐదు వేల కోట్లకు ఒప్పందాలు కుదిరాయంటున్నారు. అంతా కలిపితే 31 వేల కోట్లు. మిగిలిన 46 వేల కోట్లూ కేంద్రం ఇవ్వాలని రాష్ట్రం అభ్యర్థిస్తోంది. దీనిపై ప్రధాని దాట వేశారు. అమరావతి ఒక నగరం కాదు అదొక మహాశక్తి ఎపిని ఆధునికాంధ్రగా మారుస్తుంది దేశానికి మార్గదర్శనం చేస్తుంది గ్రోత్ ఇంజన్ అవుతుంది మీ భుజాలకు నా భుజం కలుపుతా కలిసిమెలిసి పని చేద్దాం.. అంటూ మాటల మాంత్రికునిలా మోడీ వ్యవహరించగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి నేతలు పారవశ్యంలో తరించారు. విభజన చట్టంలో రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదని స్పష్టంగా పేర్కొనగా, చట్టాన్ని అమలు చేయాలని, నిధులివ్వాలని అడిగే ధైర్యం చంద్రబాబుకు, కూటమి నేతలకు లేకపోయింది. అప్పులు సమీకరించుకోడానికి సహకరిస్తామని మాత్రమే కేంద్రం చెపుతోంది. అప్పులతో కేపిటల్‌ను కడితే ప్రజలపై భారాలు తథ్యం. రాష్ట్రాన్ని ఇంతగా దగా చేస్తున్నా బిజెపిపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అపార ప్రేమ వాత్సల్యాలు కురిపించడం నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచడమే. రాజధానికి 34 వేల ఎకరాల భూములిచ్చిన రైతులు అమరావతే రాజధానిగా చట్టబద్ధత కోరుతున్నారు. సిఎం ఆ మేరకు హామీ ఇచ్చారు కూడా. కానీ పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిన మోడీఈ ఊసెత్తక పోవడం రైతులను వంచించడం కాదా? తీసుకున్న భూములకే దిక్కులేకపోగా ఇంకా 44 వేల ఎకరాలు దేనికో అర్థం కాదు. బాహుబలి రాజధానికి స్వస్తి పలికి అన్ని వసతులతో రాజధానికి పరిమితం కావాలన్నది నిపుణుల సూచన. విభజన చట్టం మేరకు ప్రత్యేక హోదా సహా హామీల సాధన ద్వారా ప్రణాళికాబద్ధ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్నారు. వారి ఆకాంక్షల ప్రకారం నడుచుకోడం రాష్ట్ర ప్రభుత్వ విధి.

# జ్ఞాన జ్యోతికి నెలవు



పురాతన నాగరికతల చరిత్రలో భారతదేశానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. జ్ఞానాన్వేషణ, విద్యాభ్యాసం, విశాలదృష్టిని పదిలంగా నిలిపిన నాగరికతగా ఇది ఎన్నో తలాలపై వెలుగొందింది. ఈ క్రమంలో తక్షశిల అనే పట్టణం ఒక అద్భుత జ్ఞాన కేంద్రంగా ఎదిగింది. దాదాపు 2500 సంవత్సరాల కిందట సకల విద్యాశాఖల పుట్టినిల్లుగా గుర్తింపు పొందిన తక్షశిల విశ్వవిద్యాలయం, ముఖ్యంగా అక్కడి గ్రంథాలయం, భారతీయ విజ్ఞాన పాఠశాలల మహిమను ప్రపంచానికి చాటి చెప్పింది. ఇప్పటి పాకిస్తాన్‌లోని రావల్పిండి సమీపంలో ఉన్న తక్షశిల విశ్వవిద్యాలయం నిజంగా ‘యూనివర్సిటీ’ అనే పదానికి మించిన బహుళ విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఇది కేవలం విద్యాబోధనే కాకుండా, జ్ఞాన మార్గంలో పరిశోధనలతో శాస్త్రీయ చింతనకు నిలయంగా నిలిచింది. ఈ నగరానికి హృదయంగా ఉన్న గ్రంథాలయం ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన శిష్యులకు ఆదర్శ విద్యా వేదికగా నిలిచింది. వైద్యం, ఖగోళశాస్త్రం, వ్యాకరణం, తత్వశాస్త్రం, రాజనీతి శాస్త్రం వంటి విభిన్న విభాగాల్లో వేలాది గ్రంథాలు, తాళపత్ర గ్రంథాల రూపంలో సేకరించి అక్కడ భద్రపరిచారు.

### హిందూ, బౌద్ధ, జైన గ్రంథాల కూడలి

ఈ గ్రంథాలయ విశిష్టత ఏకకాలంలో రెండు ప్రధాన అంశాల్లో ఉంది. జ్ఞాన పరిమాణంలోనే కాకుండా దాని వ్యాప్తిలోనూ ఉంది. చరకుని ఆయుర్వేద గ్రంథాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం, పాణినీయ శబ్దానుశాసనం, భరతముని నాట్యశాస్త్రం వంటి అనేక అపురూప గ్రంథాలన్నీ అక్కడ నిక్షిప్తమై ఉండేవి. హిందూ, బౌద్ధ, జైన గ్రంథాలు అన్నీ అక్కడ సమపాళ్లలో ప్రాధాన్యం పొందాయి. వివిధ దార్శనిక వేదికల మీద పండితుల మధ్య జరిగిన వాద ప్రతివాదాలు, చర్చలు విద్యకు జీవం పోసేవి. తక్షశిలలో గ్రంథాలయం కేవలం పుస్తకాల నిల్వ కేంద్రంగా కాక, జ్ఞాన ప్రయోగశాలగా అభివృద్ధి చెందింది.

### భారతీయ తాత్విక ప్రతిబింబం

తక్షశిల విద్యా విధానం అనేక మండలాల్లో శిష్యులకు సమగ్ర విజ్ఞానాన్ని అందించేది. వైద్య విద్యార్థులకు తత్వశాస్త్రం నేర్పించబడేది. తత్వశాస్త్ర శిష్యులు ఖగోళ విజ్ఞానం అధ్యయనం చేయాల్సి వచ్చేది. ఇలాంటి అంత:శాఖా (ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్) విద్యను అందించడం ఆనాటి నుండే ఉన్నట్లు దీని వల్ల తెలుస్తోంది. విద్యార్థులు సమగ్ర దృక్పథంతో కూడిన పౌరులుగా ఎదిగేవారు. ఇది భారతీయ తత్వాన్ని ప్రతిబింబించే విధంగా, విద్యను వ్యక్తిగత విముక్తికి, సామాజిక సేవకూ ఉపయోగించాలన్న ఆలోచనకు ఆదర్శంగా నిలిచింది. ఈ గ్రంథాలయం గొప్పతనం ఇందులోని విద్యా స్వేచ్ఛలోనూ ప్రతిఫలిస్తుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శిష్యులకు ఆర్థికంగా సహాయం అందించేది. స్థానికులు, పాలకులు. గురు-శిష్య సంబంధం ఆధారంగా అభ్యాసం జరిగేది. బ్యూరోక్రటిక్ నియమాలు లేని ఈ పద్ధతిలో స్వేచ్ఛ, స్ఫూర్తి ఉండేది. విద్యా భంగిమను శాసించే యంత్రాంగం కాక, విజ్ఞాన ద్యోతకుల చేతుల్లో విద్య అభివృద్ధి చెందింది.

### తక్షశిల దహనంతో నాగరికత అంతర్ధానం

ఐదవ శతాబ్దంలో హుణులు తక్షశిలపై దాడి చేసి లక్షల సంఖ్యలో ఉన్న గ్రంథాలను తగల పెట్టడం వల్ల కేవలం ఓ ప్రాంగణం కాదు, ఒక నాగరికతే అంతరించిపోయింది. లక్షలాది గ్రంథాలు అగ్నికి ఆహుతి కావడంతో ఆనాటి విజ్ఞానం, సంస్కృతి ఎలా ఉంటుందో తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఇది అలెగ్జాండ్రియా లైబ్రరీ విధ్వంసానికి సమానమైన విపత్తుగా పోల్చవచ్చు. కానీ ధ్వంసమైనా, తక్షశిల ఆత్మ, దాని విద్యా పరంపర ప్రపంచాన్ని ఇప్పటికీ చైతన్య పరుస్తూనే ఉంది. గ్రంథాలయాల ఉనికి గురించి, వాటి లక్ష్యం గురించి ఈ రోజు మనం ఆలోచించాలంటే, తక్షశిల స్ఫూర్తిగా మారుతుంది.

### జ్ఞానం సరుకు కాదు.. సమాజ సంపద

ఈ కాలంలో గ్రంథాలయాలు డిజిటలైజేషన్, నిధుల కొరత, పఠన అలవాట్ల తక్కువ తనంతో బలహీనపడుతున్నప్పుడు తక్షశిల మళ్లీ మన మనసుల ముందుకు రావాలి. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వ గదులు కాదు. అవి ఆలోచనలకు ఆలయాలు. జ్ఞానం ఉచితంగా అందించాల్సిన పవిత్ర బాధ్యతగా గ్రంథాలయాలు పని చేయాలి. జ్ఞానం అనేది వాణిజ్య వస్తువు కాదు, అది సమాజ సంపద.

### కాలాతీతమైన పురా జ్ఞాపకం

తక్షశిలను గుర్తు చేసుకోవడం అంటే గడచిన గౌరవనీయుల కాలాన్ని మాత్రమే స్మరించుకోవడం కాదు. అది భావితరాలకు మార్గదర్శనం చూపే ఒక మోడల్‌ను తిరిగి మన ముందు నిలబెట్టడం. విద్యను బంధించకుండా, పటిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో కాకుండా, స్వేచ్ఛతో కూడిన విచారణాత్మక ప్రక్రియగా అభివృద్ధి చేయాలంటే తక్షశిల భావనను మన హృదయాల్లో ప్రతిష్టించుకోవాలి. తక్షశిల గ్రంథాలయం కేవలం తాళపత్రాల నిలయం కాదు. అది ఒక జ్ఞాన భాండాగారం. దాని జ్ఞాపకమే మానవతా ప్రగతికి దీపశిఖగా మారాలి.

## భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత..
# రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు



ఢిల్లీ: భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగుతోంది. పాక్ కవ్వింపు చర్యలు ఆగడం లేదు. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు కొనసాగుతున్నాయి. వరుసగా 12వ రోజు కాల్పుల విరమణ ఒప్పందం పాకిస్తాన్ ఉల్లంఘించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ జమ్మూ కశ్మీర్‌లో 8 సెక్టార్లలో పాక్ సైన్యం సోమవారం విచ్చలవిడి కాల్పులకు దిగింది. కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరీ, మెంధార్, నౌషేరా, సుందర్బని, అఖ్నూర్ సెక్టార్లలో పాక్ కవ్వింపుల చర్యలకు దీటుగా బదులిచ్చినట్టు సైనిక వర్గాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్ర దాడులకు ప్రతి చర్యల్లో భాగంగా సింధూ జల ఒప్పందాన్ని పక్కన పెడుతూ ఏప్రిల్ 24న కేంద్రం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఆ వెంటనే నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం ఆగడాలు మొదలయ్యాయి. యుద్ధ సన్నద్ధత కోసం సరిహద్దు రాష్ట్రాలలో రేపు మాక్ డ్రిల్ చేయాలని కేంద్ర హెూం శాఖ ఆదేశించింది. పంజాబ్, గుజరాత్, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్, లడక్ రాష్ట్రాలకు సూచించింది. పౌరుల రక్షణ కోసం మే 7న మాక్ డ్రిల్ నిర్వహించాలని సరిహద్దు రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. శత్రువుల వైమానిక దాడి సమయంలో తమను తాము రక్షించుకునే విధానం పై పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వనుంది. ఎయిర్ రైడ్ సైరన్స్ పనితీరు పరీక్షించడం . సైరన్ ఇచ్చి ప్రజలను ఎలా అప్రమత్తం చేయాలని అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. కాగా, సరిహద్దులు దాటి భారత భూభాగంలోకి దొంగచాటుగా ప్రవేశించిన పాకిస్తాన్ జాతీయుడిని అరెస్ట్ చేసినట్లు బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. అతడి నుంచి పాక్ కరెన్సీని, గుర్తింపు కార్డును స్వాధీనం చేసుకున్నారు.గుజ్రన్ వాలాకు చెందిన మహ్మద్ హుస్సైన్‌గా గుర్తించిన అతడు ప్రస్తుతం పంజాబ్ పోలీసుల కస్టడీలో ఉన్నాడు. పహల్గాం ఘటన అనంతరం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెచ్చు రిల్లిన వేళ ఈ పరిణామం చోటు చేసుకుంది.

## నరమేధం వెనుక ఉగ్ర సంస్థ హస్తం ఉందా ? లేదా ?
### పాక్ కు ఐ.కా.స ప్రశ్న




న్యూయార్క్ : పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన అంశాన్ని నేడు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో లేవనెత్తింది. పాకిస్థాన్ చేస్తున్న వాదనలను కొట్టివేస్తూ భద్రతా మండలి సభ్యులు కొన్ని ప్రశ్నలు వేశారు. బైసారన్‌లో జరిగిన నరమేధం వెనుక లష్కరే తోయిబా ఉగ్ర సంస్థ హస్తం ఉందా ? లేదా ? అన్న ప్రశ్న వేశారు. ఈ అంశంలో పాకిస్థాన్‌ను యూఎన్ భద్రతా మండలి సభ్యదేశాలు గట్టిగా నిలదీశాయి. పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద ఘటనను అన్ని దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఆ ఘటన పట్ల బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని యూఎన్ చెప్పింది. మతం పేరిట పర్యాటకులను టార్గెట్ చేయడాన్ని భద్రతా మండలి సభ్యులు తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ చేపడుతున్న క్షిపణి పరీక్షలను కూడా యూఎన్ సభ్య దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇలాంటి సమయంలో అణ్వాపరీక్షలు చేయడంలో ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను ఎందుకు పెంచుతున్నట్లు అని అడిగారు. పెహల్గామ్ దాడి ఘటనలోయుధ క్షిపణి తమను నిందిస్తున్నట్లు పాకిస్థాన్ చేస్తున్న వాదలను యూఎన్ సభ్య దేశాలు కొట్టిపారేశాయి. భారత్‌తో సమస్యను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలని కొన్ని దేశాలు పాకిస్థాన్‌కు సూచించాయి.

## స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్ గా ప్రారంభం



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్ గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లోని మిశ్రమ సంకేతాల నడుమ తొలుత లాభాల్లో ప్రారంభమైన సూచీలు, తర్వాత స్వల్ప నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం 9 గంటల 30 నిముషాల సమయంలో సెన్సెక్స్ 67 పాయింట్ల నష్టంతో 80,729 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 19 పాయింట్ల నష్టంతో 24,442 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఐదు పైసలు తగ్గి, 84.35 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో భారతీ ఎయిర్‌టెల్, కోల్ ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఆటో, బజాజ్ ఎలక్ట్రానిక్స్ షేర్లు లాభాల్లో కదలాడుతున్నాయి. సిప్లా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అపోలో హాస్పిటల్ స్టాక్స్ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి.

## 105 డ్రోన్‌లతో ఉక్రెయిన్ దాడి .. విమానాశ్రయాల్లో ఆంక్షలు



మాస్కో : రష్యా రాజధాని మాస్కో సహా పలు ప్రాంతాలపై సోమవారం రాత్రి ఉక్రెయిన్ 100కి పైగా డ్రోన్‌లతో విరుచుకుపడిందని అధికారులు మంగళవారం ప్రకటించారు. ఉక్రెయిన్ దాడులతో రష్యాలోని పలు విమానాశ్రయాల్లో రాకపోకలను పరిమితం చేసినట్లు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి 105కి పైగా డ్రోన్‌లు రష్యాను లక్ష్యంగా చేసుకున్నాయని రక్షణ శాఖ ప్రకటించింది. మే 9న నిర్వహించనున్న రెండవ ప్రపంచ యుద్ధం విక్టరీ డే పరేడ్‌కు కొన్ని రోజుల ముందు ఈ దాడులు చోటుచేసుకున్నాయి. 80వ వార్షికోత్సవ వేడుకలకు రష్యా అధ్యక్షులు పుతిన్ సహా పలువురు ప్రపంచ నేతలు హాజరుకానున్నట్లు తెలిపింది. మాస్కోపై దూసుకువచ్చిన 19 డ్రోన్‌లను వైమానిక రక్షణ దళాలు కూల్చివేశాయని, నగర దక్షిణాన ఉన్న సూపర్ మార్కెట్, నివాస భవనాలపై శిథిలాలు పడ్డాయని మేయర్ సెర్గీ సోబ్యానిస్ టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. ధ్వంసమైన సూపర్ మార్కెట్ కిటికీ, పొగబారిన నివాస భవనం దృశ్యాలను విడుదల చేశారు. మాస్కోలోని నాలుగు ప్రధాన విమానాశ్రయాలతో సహా డజనుకి పైగా విమానాశ్రయాల్లో ఫెడరల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ ఆంక్షలు విధించినట్లు రష్యా మీడియా పేర్కొంది. వోల్గోగ్రాడ్ మరియు నిజ్నీ నోవ్‌గోరోడ్ సహా ఇతర నగరాల్లోని విమానాశ్రయాలు ప్రభావితమయ్యాయి. వొరొనెజ్ మరియు పెన్జా ప్రాంతాలలో వరుసగా 18 మరియు 10 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు ఆప్రాంత గవర్నర్లు తెలిపారు. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అన్నారు. రిల్స్క్ నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌పై దాడి జరిగిందని, ఇద్దరు యువకులు గాయపడ్డారని కుర్స్క్ ప్రాంత తాత్కాలిక గవర్నర్ తెలిపారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, దీంతో ఈ ప్రాంతంలో విద్యుత్‌ను పూర్తిగా నిలిపివేశామని అన్నారు.

## చర్చలు సఫలం.. ఆర్టీసి సమ్మె వాయిదా

**హైదరాబాద్,** : తెలంగాణలో ఆర్టీసి సమ్మె వాయిదా పడింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఆర్టీసి కార్మిక సంఘాల నేతలు సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రేపటి నుంచి రాష్ట్రంలో సమ్మె చేయనున్నట్లు కార్మిక సంఘాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు పిలుపునివ్వడంతో మంగళవారం తమ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తో కార్మిక సంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్టాడుతూ.. సమ్మె ఆలోచన విరమించుకోవాలని కార్మిక సంఘాల నేతలకు విజ్ఞప్తి చేశారు. సమ్మెకు వెళ్లి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని కోరారు. ఇప్పుడిప్పుడే సంస్థ కోలుకుంటుందని.. సమ్మె చేస్తే నష్టం జరుగుతుందని చెప్పారు. కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. త్వరలోనే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి చెప్పడంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు.

# ఆనకట్టల కట్టడి

### బాగ్లిహార్, కిషన్ గంగ, సలాల్ ప్రాజెక్టుల నుంచి నీటి నిలిపివేత
### నిలిచిపోయిన ఆరు ప్రాజెక్ట్‌ల నిర్మాణ పనుల పునరుద్ధరణ



సింధూ, దాని పరీవాహక నదుల నుంచి పాకిస్తాన్‌కు ఇకపై చుక్క నీరు కూడా వదిలేది లేదన్న భారత్, ఆ దిశగా పూర్తిస్థాయి కార్యాచరణకు రంగంలోకి దిగింది. ఆ నదులపై అన్ని జలాశయాల సామర్థ్యాలను పూర్తిస్థాయిలో పెంచే దిశగా చర్యలు తీసుకుంటోంది. వాటిలో పేరుకుపోయిన మట్టి, ఇసుక తదితరాలను పూర్తిగా తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. తద్వారా అన్ని ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వ సామర్థ్యం గరిష్ట స్థాయికి చేరేలా చూడాలని అధికారులకు సూచించింది. జమ్మూ కశ్మీర్‌లో చినాబ్ నదిపై ఉన్న కీలక బాగ్లిహార్, సలాల్ జల విద్యుత్కేంద్రాల్లో ఆ దిశగా గురువారం లాంఛనంగా మొదలైన పూడికతీత పనులు సోమవారం పూర్తిస్థాయికి చేరాయి. పనుల్లో భాగంగా రెండు డ్యాముల్లో అవసరమైన గేట్లను గురువారం నుంచి శనివారం దాకా పాక్షికంగా ఎత్తడంతో పాక్‌లోని సరిహద్దు ప్రాంతాలు నీటమునిగాయి. సింధూ జల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో ఈ విషయమై పాక్‌కు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. 1960ల్లో ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇలా జరగడం ఇదే తొలిసారి. ఒప్పందాన్ని బూచిగా చూపుతూ పూడిక పనులను పాక్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వచ్చింది. ఇప్పుడిక ఆ ప్రాజెక్టుల్లోని పూడిక మొత్తాన్నీ తొలగించి పూర్తిస్థాయిలో నీటిని నింపనున్నారు. అప్పటిదాకా చినాబ్ నదీజలాలు పాక్‌కు పూర్తిగా నిలిచిపోయినట్టే!. సింధూ ఒప్పందం ప్రకారం చినాబ్ జలాలు పాక్‌కే చెందుతాయి. వాటి ప్రవాహాన్ని భారత్ అడ్డుకోవడానికి వీల్లేదు.

### మూడింటి నుంచి నీళ్లు బంద్

జమ్మూ కశ్మీర్‌లో సింధూ, దాని పరీవాహక నదులపై ఆరుకు పైగా జలాశయాల్లో పూడికతీతను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న ఆదేశాల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ విభాగాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాయి. ప్రభుత్వరంగ ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ సారథ్యంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బాగ్లిహార్, సలాల్‌తో పాటు జీలం నది మీది కిషన్‌గంగ జలాశయాల నుంచి పాక్‌కు నీటి విడుదలను ఆదివారం నుంచి నిలిపేశారు. దాంతో పాక్‌లోని పంజాబ్ తదితర ప్రాంతాలకు సాగునీరు నిలిచిపోయింది. సలాల్ ప్రాజెక్టును 1987లో, బాగ్లిహార్‌ను 2008లో నిర్మించారు. అప్పటినుంచీ వాటిలో పూడికతీత చేపట్టడం ఇదే తొలిసారి. సలాల్ 690 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. బాగ్లీహార్ సామర్థ్యం 900 మెగావాట్లు. పూడిక నేపథ్యంలో వాటిలో విద్యుదుత్పాదన చాలాకాలంగా సామర్థ్యం కంటే తక్కువగా జరుగుతూ వస్తోంది.

### 10 వేల మెగావాట్ల విద్యుత్

జమ్మూ కశ్మీర్‌లో సింధూ, ఉప నదులపై మొదలు పెట్టిన ఆరు ప్రాజెక్టులు పాక్ అభ్యంతరాల నేపథ్యంలో చాన్నాళ్లుగా నిలిచిపోయాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో వాటి నిర్మాణాన్ని తక్షణం పునఃప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. సవాల్‌కోట్ (1,856 మెగావాట్లు), కిర్తాయ్ 1, 2 (1,320 ఎంవీ), పాకాల్‌దుల్ (1,000 ఎంవీ)తో పాటు 2,224 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన మరో ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితే ఏకంగా 10 వేల మెగావాట్ల అదనపు విద్యుత్‌తో పాటు సాగు, తాగునీటి అవసరాలకు మరిన్ని జలవనరులు అందుబాటులోకి వస్తాయి. సింధూ ఒప్పందం కింద ఇలాంటి పనులకు పాక్‌కు ఆర్నెల్ల నోటీసు ఇవ్వాల్సి ఉండేది. దాన్ని నిలిపివేసిన నేపథ్యంలో భారత్ తాజా చర్యలను అడ్డుకునేందుకు పాక్‌కు పెద్దగా మార్గాలేమీ లేవు. మధ్యవర్తి అయిన ప్రపంచబ్యాంకు కూడా పెద్దగా చేసేదేమీ లేదు. ఇరు దేశాలనూ చర్చలకు ప్రోత్సహించడం తప్ప ఒప్పందం అమలుకు ఆదేశించడం వంటి అధికారాలేవీ దానికి లేవు.

# రైలు బండి... ఇక పొగ రాదండీ

### డీజిల్‌కు స్వస్తి పలికిన రైల్వే
### దక్షిణ మధ్య రైల్వేలో 100% విద్యుదీకరణ
### అక్కన్నపేట-మెదక్ పనుల పూర్తితో సాధన
### దక్షిణ మధ్య రైల్వే, వాల్తేరు డివిజన్లో పూర్తి
### తెలుగు రాష్ట్రాల్లో విద్యుదీకరణ సంపూర్ణం
### రైల్వేకు తగ్గిన 'చేతి చమురు'
### కి.మీ.కు రూ.270 చొప్పున ఆదా
### తగ్గిన వ్యయం, పర్యావరణ ప్రియం



తెలుగు రాష్ట్రాల్లో పొగబండిని ఇక పొగరాని బండి అని పిలవాలి. ఎందుకంటే.. దేశంలో డీజిల్ రైలింజిన్లకు స్వస్తి చెబుతూ కేవలం కరెంటు ఇంజిన్లతోనే రైళ్లు నడపాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని దక్షిణ మధ్య రైల్వే విజయవంతంగా ఆచరణలోకి తెచ్చిం ది. 2025 మార్చి నాటికి 100% లైన్లను విద్యుదీకరించాలన్న లక్ష్యాన్ని సాధించింది. దేశవ్యాప్తంగా 97% సాధించగా, దక్షిణ మధ్య రైల్వే పూర్తిగా సాధించి చూపింది. మరోపక్క వాల్తేర్ డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాల్లోనూ ఇప్పటికే విద్యుదీకరణ పూర్తయింది. తెలుగు రాష్ట్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎలక్ట్రిక్ ఇంజిన్లతోనే రైళ్లను నడిపే పరిస్థితి ఏర్పడింది. దీన్ని రైల్వేలో భారీ విజయంగా భావిస్తున్నారు. డీజిల్ ఇంజిన్ల వల్ల రైల్వే శాఖకు భారీగా చేతి'చమురు'వదులుతోంది. లైన్ల విద్యుదీకరణ ద్వారా, డీజిల్ భారాన్ని తగ్గించుకుని ఆ మొత్తాన్ని రైల్వేల్లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఖర్చు చేస్తోంది. దేశవ్యాప్తంగా 97% విద్యుదీకరణ సాధించగా, దక్షిణ మధ్య రైల్వే పూర్తిగా సాధించి చూపింది. కర్ణాటక (96%), తమిళనాడు (96%), రాజస్తాన్ (98%) వంటి రాష్ట్రాల్లో ఇంకా పూర్తి కాలేదు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు విద్యుదీకరణ పూర్తయిన రైల్వే ట్రాక్ నిడివి 68,730 కిలోమీటర్లు. ఇందులో గత పదేళ్లలో పూర్తయింది 46,928 కిలోమీటర్లు.

### జోన్‌పరిధిలో ఇలా..

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 6,609 రూట్ కి.మీ. మేర రైలు మార్గాలున్నాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రం పరిధిలో 2,015 రూట్ కి.మీ.ల ట్రాక్ ఉంది. వాల్తేర్ డివిజన్ పరిధిలో సుమారు 1,075 రూట్ కి.మీ. మేర ఉంటే.. ఇందులో ఏపీ పరిధిలో దాదాపు 545 కి.మీ.ల ట్రాక్ ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో అక్కన్నపేట-మెదక్ మధ్య 17 కి.మీ. మేర పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. వాటిని వేగంగా నిర్వహించి విద్యుత్తు రైళ్ల నడపడం ప్రారంభించారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే యావత్ దక్షిణ మధ్య రైల్వేలో విద్యుదీకరణ పూర్తయినట్టు తేల్చారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 1,280 విద్యుత్తు లోకోమోటివ్‌లు వినియోగిస్తున్నారు. వీటిలో 291 ఇంజిన్లను ప్రయాణికుల రైళ్లకు వాడుతుండగా, మిగతావాటిని సరుకు రవాణా రైళ్లకు వినియోగిస్తున్నారు. ఇక జోన్‌పరిధిలోనే ఉన్నప్పటికీ, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్-గుల్బర్గా పరిధిలోకి వచ్చే ఖానాపూర్-కమలాపూర్-నందగావ్ మార్గంలో కొంతమేర పని మిగిలి ఉంది. అయితే, దాన్ని నిర్వహించే బాధ్యత దక్షిణ మధ్య రైల్వే సరిహద్దుతో ఉన్న సెంట్రల్ రైల్వేది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే రికార్డు సమయంలో లక్ష్యాన్ని సాధించినట్టయింది.

### ఇంకా డీజిల్ ఇంజిన్లు.. ఎందుకంటే?

వంద శాతం విద్యుదీకరణ జరిగినప్పటికీ, దక్షిణ మధ్య రైల్వే జోన్‌పరిధిలో ఇప్పటికీ 395 డీజిల్ ఇంజిన్లను నిర్వహిస్తున్నారు. వీటిలో 245 ఇంజిన్లను సరుకు రవాణా రైళ్లకు వాడుతున్నారు. అలాగే వాల్తేర్ డివిజన్లో మొత్తం 387 ఇంజిన్లు ఉంటే అందులో డీజిల్ ఇంజిన్లు 162. భవిష్యత్తులో రైళ్లు ఢీకొనటం, వరదలు లాంటి విపత్తులతో విద్యుత్తు సరఫరా వ్యవస్థ దెబ్బతిని కరెంటు ఇంజిన్లు వాడలేని పరిస్థితి ఎదురైతే, అత్యవసర సేవల కోసం ఈ డీజిల్ ఇంజిన్లతో రైళ్లు నడుపుతారు. ఆ సమయంలో డీజిల్ ఇంజిన్లు ఫిట్‌గా ఉండాలంటే వాటిని నిరంతరం వాడాలి.

### ఇక మిగిలిందదే..

తెలంగాణ పరిధిలో ప్రస్తుతం ఒకే ఒక్క కొత్త రైలు మార్గం పనులు జరుగుతున్నాయి. మేడ్చల్ సమీపంలోని మనోహరాబాద్ నుంచి మొదలై కరీంనగర్ శివారులో కొత్తపల్లి వరకు సాగే లైను. ఇందులో సిద్దిపేట వరకు ట్రాక్ ఏర్పాటు పూర్తి కావటంతో రైలు సేవలు కూడా మొదలయ్యాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల మీదుగా పైకి కొనసాగాల్సి ఉంది. ఈ పనులు 2026 నాటికి పూర్తవుతాయి. ఇంతకాలం కొత్త లైన్ల నిర్మాణాన్ని ముందు చేపట్టి, భవిష్యత్తులో కుదిరినప్పుడు మార్గాన్ని విద్యుదీకరించేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి చెప్పి, కొత్త లైన్ల పనులు జరుగుతున్న సమయంలోనే సమాంతరంగా విద్యుదీకరణ పనులూ నిర్వహిస్తున్నారు. ఈమేరకు మనోహరాబాద్-కొత్తపల్లి మార్గాన్ని కూడా విద్యుదీకరించాలని నిర్ణయించింది. 2026 జూన్‌నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పనులు జరుగుతున్న ప్రాజెక్టు కావడంతో దీన్ని విద్యుదీకరణ జాబితాలో చేర్చలేదు. అసంపూర్తి ప్రాజెక్టు కావటంతో దీన్ని విద్యుదీకరణ జరగని ప్రాజెక్టుగా తేల్చలేదు. ఫలితంగా వంద శాతం విద్యుదీకరణ సాధించిన జోన్‌గా దక్షిణ మధ్య రైల్వే జోన్‌ను రైల్వే శాఖ ప్రకటించింది.

### డీజిల్‌తో రూ.400 కరెంటుతో రూ.130 మాత్రమే

డీజిల్ ఇంజిన్‌నడపడం వల్ల రైల్వేకు ఒక కి.మీ.కు అయ్యే వ్యయం సగటున రూ.400. అదే కరెంటు ఇంజిన్‌కి.మీ.కు 20 యూనిట్ల కరెంటును ఖర్చు చేస్తుంది. ఈ రూపంలో అయ్యే వ్యయం సగటున రూ.130 మాత్రమే. సరుకు రవాణా రైలు నిర్వహణలో డీజిల్‌తో పోలిస్తే కరెంటు ఇంజిన్‌కు మూడో వంతు వ్యయం, ప్రయాణికుల రైలుకు నాలుగో వంతు వ్యయం అవుతుందని అంచనా. రైల్వే శాఖ లెక్కల ప్రకారం.. 2018-19లో రైల్వే శాఖ డీజిల్ రూపంలో చేసిన ఖర్చు రూ.18,587 కోట్లు. విద్యుదీకరణతో ఏటా రూ.1,000 కోట్లకు పైగా మొత్తాన్ని ఆదా చేస్తోంది. గత పదేళ్లలో విద్యుదీకరణ వల్ల దాదాపు 640 కోట్ల లీటర్ల డీజిల్‌ను ఆదా చేసిందని నివేదికలు చెబుతున్నాయి. దీనివల్ల 400 కోట్ల కేజీల కర్బన ఉద్గారాల విడుదలను నివారించగలిగాం.

# మితవాదానికి మరో ఓటమి



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గమనించుకుంటున్నారో లేదో గానీ ప్రపంచంలో ఎక్కడ ఎన్ని కలు జరిగినా ఆయన చర్చనీయాంశం అవుతున్నారు. గెలుపోటముల్ని ప్రభావితం చేస్తున్నారు. ఇటీవల కెనడా ఎన్నికల్లో ట్రంప్ పట్ల మెతకగా వ్యవహరించిన కన్సర్వేటివ్‌లు ఓటమిపాలై, ఊహించని రీతిలో అధికార లిబరల్ పార్టీ గెలుపొందింది. ఇప్పుడు ఆస్ట్రేలియాలోనూ అదే జరిగింది. అచ్చం ట్రంప్ విధానాలనే అనుకరిస్తూ ఆస్ట్రేలియా ఎన్నికల్లో తిరుగులేని గెలుపు సాధించాలనుకున్న విపక్ష కన్సర్వేటివ్ పార్టీ అపజయాన్ని మూటకట్టుకోవటమే కాదు... ఆ పార్టీ గెలిస్తే ప్రధాని అవుతారనుకున్న నాయకుడు పీటర్ డటన్ సైతం ఓటమి పాలయ్యారు. 2004 తర్వాత వరసగా రెండోసారి కూడా అధికారం నిలబెట్టుకున్న పార్టీగా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ చరిత్ర సృష్టించింది. ఇక సింగపూర్‌లో ఎప్పటిలా పద్నాలుగోసారి సైతం అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) తిరిగి అధికారంలోకి రావటం వింతేమీ కాదుగానీ... ఆ పార్టీ నేత, ప్రధాని లారెన్స్ వాంగ్ ప్రచారసభల్లో ట్రంప్‌పై రణభేరి మోగించారు. అమెరికా విధించిన సుంకా లకు ప్రతీకార సుంకాలుంటాయని ప్రకటించారు. అసలు అమెరికాకు సింగపూర్ నుంచి ఎగుమతులు చేసేదే లేదని స్పష్టం చేశారు. 97 స్థానాలున్న సభలో ఆ పార్టీ 87 స్థానాలు గెల్చుకోవటం గతంలో కూడా జరిగినా ఈసారి వోటు శాతాన్ని సైతం 66.57కి పెంచుకుని చరిత్ర సృష్టించింది. ఇక రుమేనియాలో మాత్రం ట్రంప్‌ను తలకెత్తుకున్న తీవ్ర మితవాదపక్షం అలయెన్స్ ఫర్ ది యూనిటీ ఆఫ్ రుమేనియన్స్ (ఏయూఆర్) నాయకుడు జార్జి సైమన్ తొలి రౌండ్‌లో గెలుపొందారు. ఈ నెల 18న జరగబోయే రెండో రౌండ్ ఎన్నికల్లో సైతం ఆయనదే విజయమన్న అంచనాలున్నాయి. వచ్చే సెప్టెంబర్‌లో ఎన్నికలు జరగబోయే నార్వేలో కూడా ట్రంప్ ప్రభావం కనబడుతోంది. అక్కడి అధి కార లేబర్ పార్టీకి ఓటమి తప్పదని జనవరిలో వివిధ సర్వేలు ప్రకటించగా, ఆ మరుసటి నెలకల్లా అంతా మారిపోయింది. ఇప్పుడు లేబర్ పార్టీయే గెలుపుగుర్రంగా కనబడుతోంది. కరోనా దాపురించినప్పటి నుంచీ ఆస్ట్రేలియా ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కాదు. ముఖ్యంగా మూడేళ్లుగా ఆ దేశంలో ఉత్పాదకత తీవ్రంగా దెబ్బతింది. ద్రవ్యోల్బణం పెరిగింది. దాన్ని తగ్గించటానికి ఆస్ట్రేలియా రిజర్వ్‌బ్యాంక్ 13 సార్లు వడ్డీరేట్లు పెంచింది. ఫలితం లేకపోగా అధిక ధరల కారణంగా కొనుగోళ్లు ఆగిపోయి గృహనిర్మాణ రంగం పడకేసింది. వీటన్నిటి వల్ల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఇవన్నీ చూసి తదుపరి ఎన్నికల్లో తమదే విజయమని కన్సర్వే టివ్ పార్టీ కలలుగంది. అమెరికాలో ట్రంప్‌కు పెరుగుతున్న మద్దతు చూసి అదే తరహా ప్రకటనలు చేసి ఆ పార్టీ నాయకుడు డటన్ మొదట్లో వోటర్ల మెప్పు పొందినమాట వాస్తవం. ప్రభుత్వ రంగంలో 40,000 ఉద్యోగాలు రద్దుచేస్తామని, వలసల విషయంలో కఠినంగా వుంటామని, ఉదార వాద విధానాలైన భిన్నత్వం, అందరినీ కలుపుకొనిపోవటం వగైరాలకు కాలం చెల్లిందని ఆయన పదే పదే ప్రకటించారు. ఆస్ట్రేలియా మొదటి నుంచీ అమెరికా మిత్ర దేశమే. అయినా ట్రంప్ ఏమాత్రం కనికరించలేదు. అందరితోపాటు ఆస్ట్రేలియాపైనా భారీయెత్తున సుంకాలు పెంచుతా మని ప్రకటించారు. ఇవింకా అమల్లోకి రాకపోయినా అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం కారణంగా అసలే అంతంతమాత్రంగా వున్న ఆర్థిక వ్యవస్థ మరింత అనిశ్చితిలోకి పోయింది. ఈ దశలో డటన్ తనకు ట్రంప్‌తో వున్న వ్యక్తిగత సాన్నిహిత్యం వల్ల ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థను సునాయాసంగా గట్టెక్కిస్తానని హామీ ఇచ్చారు. కానీ ట్రంప్ దూకుడు కారణంగా స్టాక్ మార్కెట్లన్నీ బోల్తా కొట్టడంతో డటన్‌కు దిక్కుతోచలేదు. దాంతో ట్రంప్ ప్రస్తావన మానుకున్నారు. కానీ అప్పటికే జరగా ల్సిన నష్టం జరిగిపోయింది. జనం లేబర్ పార్టీకే వోటేయాలన్న నిర్ణయానికొచ్చారు. సింగపూర్ సైతం ఆర్థిక అస్థిరతలో కొట్టుమిట్టాడుతోంది. అసలే వాణిజ్యం దెబ్బతిని వుండగా ట్రంప్ అధిక సుంకాల ప్రకటన మరింత దెబ్బ తీసింది. ఆస్ట్రేలియా మాదిరే ఆ దేశంలోనూ పౌరులకు సొంతిళ్లు సమకూర్చుకోవటం సమస్యగా మారింది. పెరిగిన ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం, ఉద్యో గాలు కోల్పోతామన్న భయాందోళనలు ప్రజల్ని వణికిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంచనాల కన్నా జీడీపీ చాలా తగ్గి 3.8 శాతానికొచ్చింది. వచ్చే త్రైమాసికంలో అది 2 శాతం మించక పోవచ్చు. ట్రంప్ సుంకాల బెదిరింపు సరేసరి. అందుకే ఈ అనిశ్చితిలో పాలకపక్షాన్నే మరోసారి గెలిపించటం ఉత్తమమన్న నిర్ణయానికొచ్చారు. కనుకనే పీఏపీ వోట్ల శాతం 61.2 నుంచి 65.67కి పెరి గింది. సింగపూర్ ఎన్నికల్ని విదేశీ మదుపుదార్లు, అంతర్జాతీయ మీడియా, వివిధ దేశాల ప్రభుత్వాలు శ్రద్ధగా గమనించాయి. ఈ అయిదేళ్లూ సింగపూర్ ఎదుర్కొన్న సమస్యలు అలాంటివి మరి. ఏతావతా ఇప్పటికి ఒక్క రుమేనియా మినహాయించి ట్రంప్‌ను చూసి వాతలు పెట్టుకుంటున్న నాయకులంతా ఊహించని ఓటమితో ఖంగుతింటున్నారు. నిరుడంతా మితవాద పక్షాలు ఎక్కడి కక్కడ విజయం సాధించగా, ప్రస్తుతం ఆ పక్షాలకు ఎదురుగాలి వీస్తోంది. అయితే గెలిచిన పక్షాలు చుట్టుముడుతున్న ఆర్థిక సంక్షోభాలకు ఎదురీదటం, జనం మెప్పు పొందటం అంత సులభమేమీ కాదు. ప్రపంచంతోపాటే మనమూ అని ఈ సంక్షోభాల్ని సరిపెట్టుకునే పరిస్థితుల్లో వారు లేరు. కనుక సమస్యలకు దీటైన పరిష్కారాలు కనుగొనటానికి గద్దెనెక్కిన నాయకులు ప్రయత్నించాల్సి వుంది. వారి మాటెలావున్నా ప్రపంచమంతటా తన కారణంగా మితవాద పక్షాలు బోల్తా కొట్టడాన్ని చూసైనా ట్రంప్ తన విధానాలను మార్చుకుంటారా, లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.